# దేవాలయాల ధ్వంసం ఘటనపై కేసు నమోదు





**షాద్‌నగర్, ఆగస్టు 2, ప్రభాతవార్త :** షాద్‌నగర్ పట్టణ శివారులోని ఫరూఖ్‌నగర్ రెవెన్యూ పరిధిలో గల సర్వే నంబర్ 364లో ఉన్న బీరప్ప, యెల్లమ్మ, మహంకాళి దేవాలయాల ధ్వంసం ఘటనపై షాద్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఫిర్యాదుదారు సంగాపురం లింగమయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు, 1983లో కొనుగోలు చేసిన సుమారు 10.37 ఎకరాల వ్యవసాయ భూమిలో తమ సామాజిక వర్గానికి చెందిన దేవాలయాలు ఎన్నో ఏళ్లుగా ఉన్నాయని పేర్కొన్నారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా 2009లో భూమిని హైదరాబాద్‌కు చెందిన సురేష్ కుమార్ అగర్వాల్‌కు విక్రయించినప్పటికీ, దేవాలయాలను తొలగించబోమని కొనుగోలుదారు అప్పట్లో హామీ ఇచ్చినట్లు తెలిపారు.సుమారు ఏడాది క్రితం దేవాలయాల పునర్నిర్మాణ పనులు ప్రారంభించగా, సీఎస్‌కే సంస్థ సిబ్బంది రోనక్ తదితరులు పనులను అడ్డుకున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఏడాది జూలై 31న బోనాల పండుగ నిర్వహించిన అనంతరం, ఆగస్టు 1న మధ్యాహ్నం ఎవరూ లేని సమయంలో నంబర్ ప్లేట్ లేని జేసీబీతో కొత్తగా వేసిన పునాదులను కూల్చివేయడంతో పాటు చిన్న బీరప్ప ఆలయాన్ని కూడా ధ్వంసం చేసినట్లు ఆరోపించారు. నిర్మాణ సామగ్రిని కూడా అక్కడి నుంచి తరలించినట్లు తెలిపారు. పోలీసుల విచారణలో జేసీబీని నడిపిన వ్యక్తి ఇబ్రహీం అని గుర్తించినట్లు, ఈ పని మిన్నయ్య, రోనక్ ఆదేశాల మేరకు జరిగిందని వెల్లడించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఘటనపై షాద్‌నగర్ పోలీసులు భారతీయ న్యాయ సంహిత (బీఎన్‌ఎస్) సెక్షన్లు 298, 324(2), 3(5) కింద క్రైమ్ నంబర్ 656/2026గా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. కేసు దర్యాప్తును షాద్‌నగర్ పట్టణ సీఐ రత్నాక్ నాయక్ పర్యవేక్షణలో కొనసాగిస్తున్నారు.







రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

వార్త

# శామీర్‌పేటలో ఘనంగా బోనాల పండుగ

**శామీర్‌పేట, ఆగస్టు 2, ప్రభాతవార్త:** శామీర్‌పేట ఉమ్మడి మండలంలోని వివిధ గ్రామాల్లో ఆదివారం బోనాల పండుగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. శామీర్‌పేట మండలంలోని కొన్ని గ్రామాల్లో, మూడుచింతలపల్లి మండలంలోని కొన్ని గ్రామాల్లో ప్రజలు ఆదివారం బోనాల పండుగను ఘనంగా జరుపుకున్నారు. అలియాబాద్, మూడుచింతలపల్లి మున్సిపాల్టీల పరిధిలో పలు గ్రామాల్లో బోనాల పండుగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. అమ్మవార్ల ఆలయాలకు వెళ్లి బోనాలు ఊరేగింపుగా తీసుకవెళ్లి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. పలు గ్రామాల్లో బోనాలు, ఫలహారం బండ్ల ఊరేగింపు కార్యక్రమాలు జరిగాయి. ఈ బోనాల పండుగ సందర్భంగా ఆలయాలను పలువురు ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిదులు, ఆలయాల కమిటీల నిర్వాహకులు, గ్రామాల పెద్దలు, భక్తులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేశారు. ఆయా గ్రామాల్లోని శ్రీమహంకాళి, ముత్యాలమ్మ, పోచమ్మ, దుర్గమ్మ, ఎల్లమ్మ, మైసమ్మ అమ్మవార్ల ఆలయాలకు వెళ్లి భక్తులు పూజలు చేసి బోనాలు సమర్పించారు. పలువురు భక్తులు అమ్మవార్లకు ఒడిబియ్యం పోసి మొక్కులు తీర్చుకున్నారు. బోనాలు ఊరేగింపు, ఫలహారం బండ్లు, తొట్టెలలు ఊరేగింపుగా శివసత్తుల పూనకాలతో పలువురు వెళ్లటం జరిగింది. ఆలయాలు అన్ని బోనాల పండుగ సందర్భంగా భక్తి పాటలతో మారుమోగాయి. శామీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని వివిధ గ్రామాల్లో జరిగిన బోనాల పండుగ సందర్భంగా శామీర్‌పేట సిఐ కొండా నర్సింహ్మారెడ్డి పర్యవేక్షణలో బందోబస్తు ఏర్పాటు జరిగింది. జీనోమ్‌వ్యాలీ (తుర్కపల్లి) పోలీస్‌స్టేషన్ పరిధిలోని వివిధ గ్రామాల్లో బోనాల పండుగ జరిగిన గ్రామాల్లో జీనోమ్‌వ్యాలీ సిఐ జి.గురువయ్యగౌడ్ పర్యవేక్షణలో పోలీసు బందోబస్తు ఏర్పాటు జరిగింది. శామీర్‌పేట, మూడుచింతలపల్లి మండ లాల్లో బోనాల పండుగను ప్రశాంతంగా నిర్వహించటానికి ముందస్తుగానే పలు గ్రామాల్లో పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. కొన్ని గ్రామాల్లో ఉదయం నుంచే రాత్రి వరకు బోనాలు కొందరు సాదారణంగా వెళ్లి బోనాలు సమర్పించగా, మరి కొన్ని గ్రామాల్లో మాత్రం బోనాలు సామూహికంగా ఊరేగింపుగా వెళ్లి అమ్మవార్లకు బోనాలు సమర్పించారు. గ్రామాల్లో బోనాల పండుగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు.



లక్ష్మాపూర్ గ్రామంలో బోనాల పండుగ సందర్భంగా మహిళలు ఊరేగింపుగా సామూహికంగా బోనాలు ఎత్తి ఆలయాలకు వెళుతున్న దృశ్యం



బాబగూడ గ్రామంలో సామూహికంగా బోనాల పండుగ సందర్భంగా బోనాలతో ఆలయానికి ఊరేగింపుగా మహిళలు



బోనాల పండుగ సందర్భంగా ఆలయాల వద్ద భక్తులతో కిటకిటలాడిన దృశ్యం

# రాంపల్లి బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న మంత్రి సీతక్క

**కీసర, ఆగస్టు 2, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ సర్కిల్ పరిధి నాగారం డివిజన్‌లోని రాంపల్లిలో ఆదివారం జరిగిన బోనాల ఉత్సవాల్లో మంత్రి సీతక్క పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.సిఎం రేవంత్‌రెడ్డి సహోదరుడు అనిల్‌రెడ్డి,కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కందాడి అంజిరెడ్డి పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.ఈ కార్యక్రమంలో నాగారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అద్యక్షులు ఎలసాని భూమయ్య కిరణ్‌జ్యోతి ప్రవీణ్‌కుమార్,ఎస్సీ సెల్ అధ్యక్షులు పంగ సంతోష్,నాయకులు ఇందిరా శోభన్,సంధ్యారెడ్డి,ఓం ప్రకాష్ గౌడ్,పొట్ట శ్రీశైలం,పొట్ట విఘ్నేష్,పంగ శ్రీహరి,రవి తదితరులు పాల్గొన్నారు.



బోనాల ఉత్సవాల్లో మంత్రి సీతక్క



బోనాలతో బయలుదేరుతున్న గ్రామస్తులు

# అంబేద్కర్ సిద్దాంతాలను గౌరవించాలి

**ఘట్‌కేసర్, జులై 2, ప్రభాతవార్త:** భారత రాజ్యాంగ నిర్మాత బి.ఆర్.అంబేద్కర్ కలలుగన్న స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, న్యాయం అనే విలువలను ప్రతిఒక్కరూ గౌరవించాలని యంనంపేట్ మహంకాళీ ఆలయ చైర్మన్ గణాధి రామకృష్ణాచారి అన్నారు. ప్రబుద్ధ భారత్ ఇంటర్నేషనల్ సంస్థ ఆధ్వర్యంలో అంబేద్కర్ ఆలోచనా విధానాన్ని ప్రజలు తీసుకెళ్లడానికి ఘట్‌కేసర్‌లో ఆదివారం 277వ వారం నిత్య పూలమాల కార్యక్రమం నిర్వహించబడింది. రామకృష్ణాచారి విచ్చేసి అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. పిబిఐ మేడ్చల్ జిల్లా సమన్వయకర్త ఎం.అరుణ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రామకృష్ణాచారి మాట్లాడుతూ కులం, మతం, ప్రాంతం అనే భేదాలకు అతీతంగా మనుషులను కలిపేది నిజమైన స్నేహమని, అంతర్‌కుల, అంతర్‌మత స్నేహాలను ప్రోత్సహిస్తూ భారత రాజ్యాంగ స్ఫూర్తిని, అంబేద్కర్ సిద్ధాంతాలను గౌరవించాలని తెలిపారు. స్నేహితుల దినోత్సవం సందర్భంగా అరుణ్ కుమాం మాట్లాడుతూ స్నేహం అనేది రక్త సంబంధం కాదని, విలువలతో ఏర్పడే బంధం మని కులం, మతం, భాష, ప్రాంతం అనే గీతలను చెరిపేసి మనుషులను దగ్గర చేసే శక్తి స్నేహానిదే అన్నారు.బి.ఆర్ అంబేద్కర్ చూపించిన మార్గం, భారత రాజ్యాంగం అందించిన సమాన హక్కుల స్ఫూర్తి మనందరినీ ఒకే కుటుంబంగా చూడమని పిలుస్తున్నాయని పేర్కొన్నారు అంతర్‌కుల, అంతర్‌మత స్నేహాలు పెరిగినప్పుడే సమానత్వం, సౌభ్రాతృత్వం ఆచరణలోకి వస్తాయన్నారు.

విద్య అనేది దళితులను నిరక్షరాస్యత, అజ్ఞానం, మూఢనమ్మకాలు నుండి విముక్తి కలిగించడానికి అన్ని రకాల అన్యాయాలు, దోపిడీ మరియు అణచివేతలకు వ్యతిరేకంగా పోరాడటానికి వీలు కల్పించే ఒక సాధనం అని అంబేద్కర్ మాటలు మీసాల రాజేష్‌కుమార్ సూక్తిగా గుర్తుచేశారు. అనంతరం భారత రాజ్యాంగపీఠికపై అందరూ ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు మేకల దాసు, నాయకులు కె సత్యం, బండారు రాందాస్, ఈరిటం శ్రీనివాస్, ఎం రాజేష్ కుమార్, కడప రవీందర్, గణేష్‌గౌడ్, నిఖిల్, ఉపేందర్, సుదర్శన్, కడప నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.



మిషన్ భగీరథ పైప్ లైన్ మరమ్మత్తులు చేపట్టిన సర్పంచ్, నాయకులు.

**-రైతులు విక్రయించిన ధాన్యం డబ్బులు పక్కదారి**
**-బిల్లు పత్రాలతో రోడ్డున పడ్డ రాస్నం గ్రామ రైతులు**
**-బాధిత రైతులకు న్యాయం చేయాలని ప్రజా సంఘాల డిమాండ్**
**-ఎపిఎం శ్రీనివాస్‌ను వివరణ కోరగా సిఎం, కలెక్టర్‌కు చెప్పండటూ నిర్లక్ష్యంగా సమాధానం**

వరి ధాన్యం కొనుగోలు డబ్బుల చెల్లింపుల్లో

# 'గోల్‌మాల్'



**యాలాల ఆగష్టు 2,ప్రభాతవార్త :** యాలాల మండలం రాస్నం గ్రామంలో ఐకెపి (ఇందిరా క్రాంతి పథం)ఆద్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలులో భారిగా అవినీతి అక్రమాలు జరిగాయనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. ధాన్యం కొనుగోలు చేసుకొని రెండు నెలలు గడుస్తున్నా రైతులకు మాత్రం డబ్బులు అందలేదు.గ్రామానికి చెందిన మారిగాళ్ల కాశమ్మ,127 బస్తాలు,రవికల మహమూదాబేగం 32 బస్తాలు,జుబేదా బేగం 38 బస్తాలు,మొల్ల మన్నాన్ అనే రైతు 103 బస్తాల ధాన్యం,రైకల ఫయుదాబేగం 32 బస్తాల ధాన్యం,ఎన్కెపల్లి మల్లప్ప 78 సంచులు,ఇంకా కొంత మంది రైతులు ధాన్యాన్ని రాస్నం ఐకెపి ధాన్యం కొనుగోలో కేంద్రంలో విక్రయించారు.గత రెండు నెలల క్రితం ధాన్యానికి సంంధించిన బిల్లులను(పత్రాలను)సెంటర్ నిర్వాహకులు రైతులకు అందజేశారు.విక్రయించిన ధాన్యం డబ్బులు సదరు రైతుల బ్యాంకు ఖాతాలో పడాల్సి ఉంది.అయితే సదరు రైతులకు బిల్లుల పత్రాలే తప్ప బ్యాంకు ఖాతాలో డబ్బులు జమ కాలేదు.విక్రయించిన ధాన్యం డబ్బు కోసం రైతులు నిత్యం బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు.అయితే సదరు రైతులకు సంబంధించిన డబ్బులు ఐకెపి సెంటర్‌లో పని చేసిన వ్యక్తి తాను వ్యక్తిగతంగా అందరికీ డబ్బులు చెల్లిస్తానని పేర్కోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.ధాన్యం విక్రయిస్తే అట్టి డబ్బులు రైతుల బ్యాంకు ఖాతాలో జమ కావాలి... కానీ ఇతరుల ఖాతా నుంచి చెల్లింపులు ఏమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు.గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచు జనార్ధన్‌రెడ్డి అనే రైతు బ్యాంకు ఖాతాలో సుమారు 130 ధాన్యం సంచుల డబ్బులు జమ కావడం జరిగింది.అట్టి డబ్బులను కేంద్రం నిర్వాహకులు ఎన్కెపల్లి మల్లయ్య అనే రైతుకు చెల్లించినట్లు రైతులు తెలిపారు.మల్లప్ప బ్యాంకు కాతాలో జమ కావల్సిన డబ్బులు మరో రైతు బ్యాంకు ఖాతాలో జమకావడం ఏమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు.రాస్నంలో కొనసాగే ధాన్యం కొనుగోలు కేంద్రంలో పని చేసే ఐకెపి సిబ్బంది అన్నీ తానై నడిపిస్తూ అక్రమాలకు పాల్పడుతున్నట్లు బాధిత రైతులు ఆరోపించారు. సదరు వ్యక్తి నిర్వాహకంపై రైతులు ఆదివారం మండల ఏపిఎంకు ఫోన్‌ద్వారా సమాచారం అందించారు. ఇదే విషయమై రైతులు ప్రజా సంఘాల నాయకులు కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు ఉప్పలి మల్కయ్యను,వ్య,కా,స అధ్యక్షులు బగ్గప్ప తదితరులను కలిసి గోడు వినిపించారు.రైతులకు ధాన్యం డబ్బులు చెల్లించకుంటే కలెక్టర్‌ను కలిసి పిర్యాదు చేస్తామని తెలిపారు.ఈ ధాన్యం అవకతవకలపై ఉన్నతాధికారులు పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి భాద్యులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

**బాధ్యతాయుతంగా వివరణ ఇస్తున్న మండల సమాఖ్య ఎపిఎం శ్రీనివాస్ :**

రైతులకు ధాన్యం డబ్బుల చెల్లింపు విషయమై యాలాల మండల మహిళా సమాఖ్య ఎపిఎం శ్రీనివాస్‌ను వివరణ కోరగా ముఖ్యమంత్రి,కలెక్టర్‌లకు చెప్పండి.లేదా మీరు పత్రికల్లో ఏమైనా రాసుకోండని పొంతన లేని ,భాద్యాతాయుతమైన వివరణ ఇవ్వడం విడ్డూరం.ఇలాంటి అధికారుల తీరువల్లే మహిలా సమాఖ్యాల్లో అవినీతి అక్రమాలు చోటుచేసుకుంటాయని ప్రజా సంఘాల నాయకులు మల్కయ్య,బుగ్గప్ప తదితరులు ఆరోపించారు. ఇదిలా ఉండగా కొనుగోలు కేంద్రాల నుంచి రైస్ మిల్లులకు ధాన్యం తరలించే క్రమంలో మిల్లర్లు సవ్వాలక్ష ఆంక్షలు పెడుతున్నారని ధాన్యం కొనుగోలు కేంద్రం నిర్వాహకులు పేర్కొంటున్నారు.ధాన్యంలో తాలు,తేమ తదితర వాటిని ఎత్తి చూపి బస్తా ధాన్యంపై 3 నుంచి 5 కిలోలు కటింగ్ పెట్టడం వల్లే ఇలాంటి పరిస్తితి వస్తోందని సెంటర్ నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఏది ఏమైనా ఆరుగాలం కష్టపడి పంటలు పండించే రైతులకు తమ పంట అమ్ముకున్నప్పటికీ డబ్బుల కోసం నానా ఇబ్బందులు పడడం దురదృష్టకరం.



# రుక్కమ్మకు నివాళులర్పించిన సిఎం ,పలువురు నేతలు

**మొయినాబాద్, ఆగస్టు 2, ప్రభాతవార్త :** మాతృవియోగానికి గురైన పట్నం కుటుంబాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి పరామర్శించారు. మొయినాబాద్ పరిసర జేపీఎల్ కన్వెన్షన్ లో నిర్వహించిన దశ దినకర్మలో ముఖ్యమంత్రి స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రులు దుద్దేళ్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ధనసిరి సీతక్కలతో కలిసి హాజరై రుకమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా పట్నం మహేందర్ రెడ్డిని పట్నం సున్నితమ్మును పలకరించారు. అలాగే తన ప్రత్యర్థి అని అనుకోకుండా కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డిని, షాబాద్ మాజీ జెడ్పిటిసి పట్నం అవినాష్ రెడ్డిని సైతం పలకరించారు. తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.ప్రభుత్వ సలహాదారు జితేందర్ రెడ్డి, ఎంపీలు వేం నరేందర్ రెడ్డి, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్యేలు ఈర్లపల్లి శంకర్, మధుసూదన్ రెడ్డి, బీరం హర్షవర్ధన్ రెడ్డి, ఎమ్మెల్సీ గండి విట్టల్, మాజీ ఎమ్మెల్యేలు కేస్ రత్నం, తదితరులు పాల్గొన్నారు.

**సానుభూతి తెలిపిన బిజెపి ఎంపీలు, ఈటెల కొండ విశ్వేశ్వర్ రెడ్డి..**

మాతృ వియోగానికి గురైనది పట్నం కుటుంబాన్ని ఎంపీలు పరామర్శించారు.

మొయినాబాద్ మండలం జి పి ఎల్ కన్వెన్షన్ లో నిర్వహించిన దశ దిన కర్మలో చేవెళ్ల, మల్కాజిగిరి ఎంపీలు కొండ విశ్వేశ్వర్ రెడ్డి, ఈటెల రాజేందర్ తదితరులు రుక్కమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. తమకు మహేందర్ రెడ్డి తో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేస్తూ కుటుంబ సభ్యులను పేరుపేరునా పలకరించారు.

**పట్నం రుక్కమ్మకు నివాళులర్పించిన కేటీఆర్..**

మాజీ మంత్రి బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ తారక రామారావు పట్నం కుటుంబాన్ని పరామర్శించారు. మొయినాబాద్ మండలం జేపీఎల్ కన్వెన్షన్ లో జరిగిన దశదిన కర్మ లో ఆయన పట్నం మహేందర్ రెడ్డి ,పట్నం నరేందర్ రెడ్డి, పట్నం అవినాష్ రెడ్డి లతో కలిసి రుక్కమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

మాజీ మంత్రులు జగదీశ్వర్ రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మహేష్ రెడ్డి, ఆల వెంకటేశ్వర్ రెడ్డి, శంకర్ రాథోడ్, మాజీ జిల్లా పరిషత్ చైర్ పర్సన్ లు తీగల అనిత రెడ్డి, టెక్నికల్ విభాగం అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

# వైభవ లక్ష్మీ ఆలయంలో భగవద్గీత పారాయణం



గీతా పారాయణం ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న మహేశ్వర శర్మ సిద్ధాంతి

**వికారాబాద్,ప్రభాతవార్త :** గీతా వాహిని ఆధ్వర్యంలో తొమ్మిది రోజులుగా నిర్వహిస్తున్న భగవద్గీత పారాయణ మహోత్సవం ఆదివారం జిల్లా కేంద్రంలోని వైభవ లక్ష్మీ ఆలయంలో నిర్వహించిన పారాయణంతో ముగిసింది. ఈ కార్యక్రమంలో సుమారు 400 మంది మహిళా భక్తులు, కాలనీవాసులు, వికారాబాద్ పట్టణం పరిసర ప్రాంతాల భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణం అంతా గీతా పారాయణం, మంత్రోచ్చారణలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ ముగింపు కార్యక్రమానికి సంగారెడ్డి జిల్లా ఫసల్వాడి జ్యోతిర్వాస్తు విద్యాపీఠం వ్యవస్థాపకులు మహేశ్వర శర్మ సిద్ధాంతి ముఖ్యతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ఆధ్యాత్మిక ప్రసంగం చేస్తూ, భగవద్గీత మానవ జీవితానికి మార్గదర్శిని అని పేర్కొన్నారు. శ్రీకృష్ణుడు అర్జునుడికి బోధించిన గీతా సందేశం నేటి సమాజానికీ ఎంతో అవసరమని తెలిపారు. మహిళలు కుటుంబ వ్యవస్థకు మూలస్తంభాలని, వారి జీవన విధానం, దైవారాధనలో పాటించాల్సిన నియమాలు, పూజా విధానాలు, వివిధ వ్రతాలను శాస్త్రోక్తంగా ఎలా ఆచరించాలి, సనాతన ధర్మ సంప్రదాయాలను ఎలా పరిరక్షించాలి అనే అంశాలను ఆయన వివరించారు. భక్తి, సేవ, ధర్మం, సత్సంకల్పం, నిత్య పారాయణం ద్వారా కుటుంబాల్లో శాంతి, సౌభాగ్యం, ఆధ్యాత్మిక వికాసం కలుగుతాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గీతావాహిని అధ్యక్షురాలు శ్రీదేవి, ప్రధాన కార్యదర్శి జయశ్రీ, కమిటీ సభ్యులు మాధురి, విజయలక్ష్మి, ఝాన్సీ రాణి, నీరజ, సంజీవరాణి, కరుణ, సునీత, సరిత, లక్ష్మి, సరళ, వరలక్ష్మి, నాగరాణి, అనిత, స్వాతి, మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ చిగుళ్లపల్లి మంజుల, డాక్టర్ దీప, బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షులు సదానంద రెడ్డి, డాక్టర్ సత్యనారాయణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



గీతా పారాయణం చేస్తున్న గీతా వాహిని సభ్యులు, ఇతర మహిళలు

# హీటర్ నీటి బకెట్ ఘటనలో వివాహిత మృతి

**భర్తపై అనుమానంతో కేసు నమోదు**

**జవహర్‌నగర్, ఆగస్టు2,ప్రభాత వార్త:** యాప్రాల్‌లో హీటర్ ఉన్న నీటి బకెట్‌కు సంబంధించిన ఘటనలో ఓ వివాహిత మృతి చెందిన ఘటనపై భర్తపై అనుమానం వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఫిర్యాదుదారు అంగోత్ భాద్య తన చెల్లెలు ఎ. లలిత (28)ను 2017లో బి. బాలరాజుతో వివాహం చేశారని తెలిపారు. వీరికి ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. బాలరాజు భారత సైన్యంలో ఉద్యోగం చేస్తూ యాప్రాల్‌లో కుటుంబంతో నివసిస్తున్నాడు.గత కొంతకాలంగా భార్యాభర్తల మధ్య తరచూ కుటుంబ కలహాలు జరుగు తున్నాయని, మూడు నెలల క్రితం బాలరాజు లలితపై దాడి చేయడంతో ఆమె తన పుట్టినిల్లు నాగర్ కేశంపేట్ తండాకు వెళ్లిపోయిందని ఫిర్యాదులో పేర్కొన్నారు.

అనంతరం కుటుంబ సభ్యులు ఆమెను తిరిగి అత్తవారింటికి తీసుకెళ్లగా, ఆ సమయంలో బాలరాజు తనను, తన భార్యను కూడా కొట్టాడని అంగోత్ భాద్య ఆరోపించారు.

ఆగస్టు 1న మధ్యాహ్నం 12 గంటల సమయంలో లలిత నివసిస్తున్న ఇంటి రెండో అంతస్తులో ఉండే మాను అనే వ్యక్తి ఫోన్ చేసి, లలిత తన చేతిని హీటర్ ఉన్న నీటి బకెట్‌లో పెట్టుకుందని, ఆమెను ఆసుపత్రికి తరలిస్తున్నట్లు సమాచారం ఇచ్చాడని తెలిపారు. అనంతరం కొద్దిసేపటికే లలిత మృతి చెందినట్లు, మృతదేహాన్ని ఆర్మీ ఆసుపత్రికి తరలించినట్లు తెలిసిందన్నారు.

ఉన్న బకెట్‌కు సంబంధించిన ఘటన వల్లే తన చెల్లెలు మృతి చెందిందని, ఆమె భర్త బి. బాలరాజు ఈ మరణానికి కారణమనే బలమైన అనుమానం ఉందని ఫిర్యాదుదారు పేర్కొంటూ, అతనిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు.ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టారు.

# గురుకుల్ కళాశాల సమస్యల పరిష్కారానికి కృషి



గురుకుల్‌లో ఇంటర్ విద్యార్థులతో మాట్లాడుతున్న సరిత

**ఘట్‌కేసర్, ఆగష్టు 2, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్‌లోని ఎయిడెడ్ గురుకుల్ జూనియర్ కళాశాలలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తామని తెలంగాణ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు గోగుల సరిత తెలిపారు. ఘట్‌కేసర్‌లోని గురుకుల్ జూనియర్ కళాశాలను ఆమె సందర్శించారు. ఈసందర్భంగా తరగతుల్లో విద్యార్థులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గురుకుల్‌లో అవసరమైన మౌళిక సదుపాయాలు, విద్యార్థులకు కల్పించాల్సిన సౌకర్యాలు, అధ్యాపకుల నియామకంపై ప్రిన్సిపాల్ నారాయణరెడ్డి సరితకు వినతిపత్రం అందజేశారు. ఇక్కడి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే దిశగా కమిషన్ ద్వారా సహకరిస్తామని సరిత హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో ఘట్‌కేసర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు బొక్క ప్రభాకర్‌రెడ్డి, కీసరగుట్ట డైరక్టర్ సగ్గు అనిత, అధికారి హనుమంతరెడ్డి, మాజీ వార్డుసభ్యులు బర్ల దేవేందర్ ముదిరాజ్, కాంగ్రెస్ మాజీ ప్రధాన కార్యదర్శి బర్ల రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలి

**షాబాద్, ఆగస్టు 2, ప్రభాతవార్త :** రంగారెడ్డి జిల్లాలో పోలీసు శాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే ప్రకటించి భర్తీ చేయాలని బీజేవైఎం నాయకుడు, కుర్వగూడ 1వ వార్డు సభ్యులుదాదె మహేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో పోలీస్ ఉద్యోగాల నోటిఫికేషన్ విడుదల అయింది కానీ సైబరాబాద్ రాచకొండ హైదరాబాద్ కమిషనరేట్లలో పోలీస్ ఉద్యోగాలకు ఎన్ని పోస్టులు ఖాళీగా ఉన్నాయి అనేది ఇంతవరకు ఎటువంటి ప్రకటన చేయకపోవడం వల్ల నిరుద్యోగులు అయోమయంలో పడ్డారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఈ యొక్క నోటిఫికేషన్ వివరాలు వెల్లడించాలి లేనిపక్షంలో బీజేవైఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నీకోసమే కొంచెం ఆందోళనలను చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

# ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తులకు ఆహ్వానం

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 2, ప్రభాతవార్త**

మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలోని నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల్లో జి+10 (టవర్స్) ఇందిరమ్మ ఇండ్ల కోసం రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అయితే మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలోని మేడ్చల్, కూకట్‌పల్లి, మల్కాజ్‌గిరి, కుత్బుల్లాపూర్ అసెంబ్లీ నాలుగు నియోజకవర్గాల్లో జి+10 ఇండ్ల (టవర్స్) ప్రభుత్వం అర్హులైన వారి నుంచి ధరఖాస్తులు కోరుతుంది. నాలుగు నియోజకవర్గాల్లో ప్రతి నియోజకవర్గంలో 480ఇందిరమ్మ ఇండ్లు జి+10 (టవర్స్) నిర్మాణంకు ప్రభుత్వం కేటాయించింది. ఆయా నియోజకవర్గాలకు చెందిన స్థానికులు మాత్రమే అదే నియోజకవర్గంలోనే ధరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా హౌజింగ్ పిడి జి.సిద్దార్థ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల జి+10 టవర్ నిర్మాణం విషయంపై జిల్లాలోని నాలుగు నియోజకవర్గాలకు ముందుకు తీసుకుని అర్హులైన వారి నుంచి ధరఖాస్తులు ఈ నెల 10వ తేదీ వరకు స్వీకరించటం జరుగుతుందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరు కోసం ధరఖాస్తుదారుడు వంద రూపాయలు చెల్లించి ధరఖాస్తు మీసేవా ద్వారా చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ధరఖాస్తు చేసుకునే వారు 10వేల రూపాయలు డిపాజిట్ చేయాల్సి ఉంటుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల జి+10టవర్ నిర్మాణంకు సంబంధించి ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లకు లబ్దిదారునికి 11లక్షల రూపాయలు విలువతో నిర్మాణం జరుగుతుందన్నారు. దీనిలో రాష్ట్ర ప్రభుత్వం లబ్దిదారునికి 5లక్షల రూపాయలు సబ్సిడీ ఇవ్వటం జరుగుతుందన్నారు. మిగతా 6లక్షల రూపాయలు లబ్దిదారుని వాటాగ చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పొందిన వారు నాలుగు సార్లు దశల వారీగ లబ్దిదారు వాటాకు సంబంధించి 6లక్షల రూపాయలు చెల్లించాల్సి ఉంటుందని ఆయన వివరించారు. అయితే ఏ నియోజకవర్గం వారు అదే నియోజకవర్గంలోనే ఇందిరమ్మ ఇండ్ల కోసం ధరఖాస్తులు చేసుకోవాలని ఆయన సూచించారు. ఇక మేడ్చల్ నియోజకవర్గంకు సంబంధించి పోచారంలో, మల్కాజ్‌గిరి నియోజకవర్గంకు సంబంధించి కౌకూరులో, కూకట్‌పల్లి నియోజకవర్గంకు సంబంధించి కెపిహెచ్‌బిలో, కుత్బుల్లాపూర్ నియోజకవర్గంకు సంబంధించి గాజులరామారంలో ఇందిరమ్మ ఇండ్ల జి+10 టవర్స్ నిర్మాణం చేపట్టటానికి గుర్తించినట్లు ఆయన తెలిపారు. ప్రతి నియోజకవర్గంకు 480ఇండ్ల చొప్పున నిర్మాణాలు జరుగనున్నట్లు తెలిపారు. అయితే జిహెచ్ఎంసి, ఎంఎంసి,సిఎంసి మున్సిపల్స్‌లో ప్రసుత్తం 16అసెంబ్లీ నియోజకవర్గాలు తీసుకున్నట్లు, ఆ తరువాత మిగతావి తీసుకోనున్నట్లు దశల వారీగ చేపట్టె అవకాశం ఉందన్నారు. జిల్లాలోని ఉప్పల్ అసెంబ్లీ నియోజకవర్గంకు రెండవ విడతలో వచ్చె అవకాశం ఉంటుందన్నారు. ప్రస్తుతం మాత్రం నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాలు మేడ్చల్, మల్కాజ్‌గిరి, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ ప్రాంతాల నుంచి ఇందిరమ్మ ఇళ్ల కోసం ధరఖాస్తులు చేసుకోవాలని జిల్లా హౌజింగ్ పిడి జి.సిద్దార్థ సూచించారు. అయితే ఇందిరమ్మ ఇళ్లు రాని పక్షంలో చెల్లించిన 10వేల రూపాయలు తిరిగి ధరఖాస్తుదారునికి చెల్లించనున్నారు. ఈ నెల 10వ తేదీలోపు (చివరి గడువు) ఆసక్తి ఉన్న అర్హులైన వారు ఇందిరమ్మ ఇండ్ల కోసం ధరఖాస్తులు చేసుకోవాలని జిల్లా హౌజింగ్ పిడి జి.సిద్దార్థ సూచించారు.

# తెలుగు సాహిత్యానికి వన్నె తెచ్చిన మహాకవి సినారె

## తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య వెలుదండ నిత్యానందరావు



సినారె పురస్కారాలతో ప్రముఖులను సత్కరిస్తున్న నిత్యానందరావు, సిధారెడ్డి, రాములు, భరణి

**నాంపల్లి, ఆగస్టు 2 ప్రభాతవార్త :** కవిగా, గొప్ప గేయ కవిగా తనదైన ప్రత్యేకశైలిలో అద్భుతంగా రాణించి పేరుప్రఖ్యాతులు పొందిన మహాకవి డా. సినారె తెలుగు సాహిత్యానికి వన్నెతెచ్చి ఎనలేని గౌరవాన్ని తీసుకొచ్చారని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య వెలుదండ నిత్యానందరావు అన్నారు. తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతికశాఖ సౌజన్యంతో మహా కవి సినారె కళాపీఠం ఆధ్వర్యంలో నాంపల్లి తెలుగు విశ్వవిద్యాలయంలోని డా. నందమూరి తారక రామారావు కళావేదికలో తెలంగాణ రాష్ట్ర సాహిత్య అకాడమీ తొలి ఛైర్మన్ డా. నందిని సిధారెడ్డి సభాధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న వెలుదండ నిత్యానందరావు సినారె చిత్రపటానికి పూలమాలవేసి ఘననివాళులర్పించారు. తెలుగు సాహిత్యానికి నారాయణరెడ్డి చేసిన సేవ, అందించిన స్ఫూర్తి తరతరాలకు ప్రేరణగా నిలుస్తుందని స్పష్టం చేశారు. విశిష్ట అతిథి పాల్గొన్న ప్రముఖ రచయిత, నటుడు, గాయకుడు డా. తనికెళ్ల భరణి సి.నారాయణరెడ్డి కవితా వైభవాన్ని సోదాహరణంగా వివరించారు. ఈ సందర్భంగా నిత్యానందరావు, సిధారెడ్డి, తనికెళ్లభరణి, దాసరి దయానందరెడ్డి, సంస్థ అధ్యక్షుడు మల్లేకేడి రాములు, డా. పోరెడ్డి రంగయ్య తదితరులతో కలిసి ప్రముఖులు ఆచార్య మసన చెన్నప్ప, ఆచార్య బన్న అయిలయ్య, డా. రాధేయ, డా. ప్రభాకర్‌జౌని, ఆచార్య కోయి కోటేశ్వరరావు, డా. కొండపల్లి నీహారిణి, డా. చెమన్, ధూళిపాళ అరుణ, డా, పసునూరు శ్రీధర్‌బాబు, నామాల రవీంద్రసూరి తదితరులను ఘనంగా సత్కరించి పురస్కారాలు అందజేశారు. సభకుముందు చిమ్మపూడి శ్రీరామమూర్తి రచించిన సాహితీ శిఖరం సినారె సాహిత్య సంగీత నృత్యరూపకం, సుప్రియ నేతృత్వంలో ప్రదర్శించిన శాస్త్రీయ నృత్యాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి.



ఉత్సవాల్లో సిఎం రేవంత్‌రెడ్డితో కలిసి పాల్గొన్న దానం నాగేందర్

## బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే దానం

**జూబ్లీహిల్స్, ఆగస్టు 2, ప్రభాతవార్త :** మాజీ మంత్రి, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఆదివారం సికింద్రాబాద్ శ్రీఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాల ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఉజ్జయిని మహంకాళి అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితోపాటు మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, సీతక్కతో కలిసి దానం నాగేందర్ ప్రభుత్వంతరఫున అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు.

## పింగళి వెంకయ్యకు భారతరత్న ఇవ్వాలి



పింగళి వెంకయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కోదూరు శ్యామలరావు

**చిక్కడపల్లి, ఆగస్టు 2 ప్రభాతవార్త :** జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య 148వ జయంతి వేడుకలను ఆదివారం పింగళి వెంకయ్య చారిటబుల్ ట్రస్ట్, స్మారక సంస్థ ఆధ్వర్యంలో విద్యానగర్ ట్రస్ట్ కేంద్ర కార్యాలయంలో నిర్వహించారు. ట్రస్ట్ చైర్మన్ కోదూరు శ్రీదేవి, సంస్థ చైర్‌పర్సన్ కోదూరు శ్యామలరావుల అధ్యక్షతన ఈ వేడుకలు నిర్వహించారు. పింగళి వెంకయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ట్రస్ట్ చైర్మన్ కోదూరు శ్రీదేవి మాట్లాడుతూ స్వాతంత్ర ఉద్యమంలో భారత మువ్వన్నెల జెండా రూపకల్పనలోనూ పింగళి వెంకయ్య అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఆయన త్యాగానికి, దేశభక్తికి తగిన గుర్తింపుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే స్పందించి ఆయనకు అత్యున్నత పౌర పురస్కారమైన భారతరత్న ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అతిథులుగా టీపీసీసీ కార్యదర్శి జి.ఎన్. కేశవ్, సంస్థ జనరల్ సెక్రెటరీ బంగారు ప్రశాంత్, సెక్రెటరీ సుధాకర్‌రెడ్డి, భాజపా నాయకులు శేషసాయి, మేడి సత్యనారాయణ, బీఆర్ఎస్ సభ్యులు కరణం సురేష్, విజయ్ యాదవ్, కిరణ్, పాలగంటి లక్ష్మణ్, కర్ర వెంకటేష్ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.

## ఎంపి ఈటలతో బిజెపి ప్రధాన కార్యదర్శి భేటీ



జగన్ యాదవ్‌ను సత్కరిస్తున్న ఎంపి ఈటల రాజేందర్ తదితరులు

**ఉప్పల్, ఆగస్టు 2 ప్రభాతవార్త :** భారతీయ జనతా పార్టీ మేడ్చల్ జిల్లా అర్బన్ ఓబిసి జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులైన బీజేపీ సీనియర్ నాయకులు వల్లపు జగన్ యాదవ్‌ను ఆదివారం మల్కాజిగిరి ఎంపి ఈటల రాజేందర్ శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా జగన్‌యాదవ్ ఆధ్వర్యంలో పలువురు నేతలు ఆదివారం మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్‌తోపాటు బిజెపి జిల్లా అధ్యక్షుడు జె.కె.శేఖర్‌యాదవ్ తదితరులను మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ శాలువాతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, పార్టీ బలోపేతానికి నిబద్ధతతో పని చేస్తూ, ఓబిసి వర్గాల సంక్షేమం, ప్రజా సమస్యల పరిష్కారానికి అంకిత భావంతో సేవలందించాలని సూచించారు. కార్యక్రమంలో ఓబిసి కమిటీ సభ్యులు, జాయింట్ స్పోక్స్ పర్సన్ ఉలుగొండ నారాయణదాసు, సెక్రటరీ పిసరి శంకర్, రాజేందర్‌గౌడ్, అసెంబ్లీ కో కన్వీనర్ సబిత యాదవ్ మరియు పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## జూబ్లీహిల్స్‌లో ఇంటర్నేషనల్ హ్యాపీ పెట్స్ డే

**జూబ్లీహిల్స్, ఆగస్టు 2, ప్రభాతవార్త:** జూబ్లీహిల్స్ లోని జిగ్లీ పెట్ కేర్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌లో ఇంటర్నేషనల్ హ్యాపీ పెట్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వందలాది మంది పెట్ పేరెంట్స్ తమ పెంపుడు జంతువులతో పాల్గొన్నారు. ఉచిత ఆరోగ్య పరీక్షలు, వెటర్నరీ నిపుణుల సలహాలు, వెల్‌నెస్ కన్సల్టేషన్లు, పెట్ ఫస్ట్ ఎయిడ్ శిక్షణ నిర్వహించి పెంపుడు జంతువుల ఆరోగ్య సంరక్షణపై అవగాహన కల్పించారు. అలాగే టికెట్ విక్రయాల ద్వారా సమీకరించిన రూ.6 లక్షలను జిగ్లీ ఫౌండేషన్‌కు అందజేసి, వీధి కుక్కల సంక్షేమ కార్యక్రమాలకు వినియోగించనున్నట్లు సంస్థ వెల్లడించింది.

## మలక్‌పేటలో ఘనంగా అమ్మవారి బోనాల ఉత్సవాలు

**మలక్‌పేట, ఆగస్టు 2, ప్రభాతవార్త:** మలక్‌పేట మహబూబ్ మాన్షన్ మార్కెట్లో అఖిల హైదరాబాద్ హమాలీ సంఘం అధ్యక్షుడు కె. కుమార్, ప్రధాన కార్యదర్శి దానం శేఖర్‌లో ఆధ్వర్యంలో శ్రీనవదుర్గ మాత దేవాలయంలో బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. హైదరాబాద్ నగర వ్యవసాయ మార్కెట్ కమిటీ ఇన్చార్జి ఎస్జిఎస్ చిలక నర్సింహారెడ్డి, తెలంగాణ చాంబర్ ఆఫ్ అగ్రి ట్రేడర్స్ అధ్యక్షుడు, అఖిల హైదరాబాద్ హమాలి సంఘం చైర్మన్ చెగురి వెంకటరమణ, వ్యాపారస్తులు టి.అనిల్ కుమార్, వెంకటేష్ తదితరులు విచ్చేసి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బోనాల ఉత్సవాలని పేర్కొన్నారు. ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో ప్రశాంతంగా జరుపుకోవాలని కోరారు. అఖిల హైదరాబాద్ హమాలీ సంఘం అధ్యక్షుడు కే. సురేష్, ప్రధాన కార్యదర్శి దానం శేఖర్ లు మాట్లాడుతూ అమ్మవారి బోనాల ఉత్సవాలను పురస్కరించుకొని శ్రీ నవదుర్గా మాత దేవాలయంలో పలు ప్రత్యేక పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించామని తెలిపారు. అదేవిధంగా అమ్మవారి ఘటాల ఊరేగింపు కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో డప్పు, వాయిద్యాల నడుమ ఘనంగా నిర్వహించామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హమాలీ సంఘం ఉపాధ్యక్షులు పి. కథలయ్య, ఎం. రాజు, లక్ష్మణ్, సంయుక్త కార్యదర్శులు డి. రాజు, ఎం. కుమార్, పి. నర్సింగరావు, కే. మురళి, కార్యనిర్వాహక కార్యదర్శి కుమార్, రమేష్, కోశాధికారి ఎన్. రవీందర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



అమ్మవారి ఘటాలను ఊరేగిస్తూన్న చేగురి వెంకటరమణ తదితరులు



సాంబిరెడ్డి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న రమణాచారి

## శతకపద్య సాహితీ ప్రచారకుడు సాంబిరెడ్డి

### తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు రమణాచారి

**నాంపల్లి, ఆగస్టు 2 ప్రభాతవార్త :** మరుగున పడిపోతున్న వేమన, దాశరథి భాస్కర, శతకాలను నేటితరాలకు అందించాలనే చిత్తశుద్ధతో వాటిని పునర్ముద్రణ చేసి సమాజానికి అందించిన చల్లా సాంబిరెడ్డి శతకపద్య సాహితీ ప్రచారకుడని తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు, విశ్రాంత ఐఎఎస్ అధికారి డా. కె.వి.రమణాచారి ఆయనకు ఘననివాళులర్పించారు. ఈమేరకు ప్రముఖ సాహితీ సంస్థ సాధన సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో ఇటీవల మృతి చెందిన ప్రముఖ తెలుగు సాహితీ అభిమాని చల్లా సాంబిరెడ్డి సంస్మరణ సభ రెడ్‌హిల్స్‌లోని డా. కె.వి.రమణ క్యాంపు కార్యాలయంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డా. కె.వి.రమణాచారి సాంబిరెడ్డి చిత్రపటానికి పూలమాలవేసి ఘననివాళులర్పించి ప్రసంగించారు. సాంబిరెడ్డి జీవితాంతం తెలుగు పద్య వికాసానికి ఎనలేని కృషిచేశారని అన్నారు. సంస్థ అధ్యక్షుడు సాధన నరసింహాచార్య పావని సేవాసమితిని స్థాపించిన సాంబిరెడ్డి తమ సంస్థలో కలిసి పలు కార్యక్రమాలు విద్యార్థులకు తెలుగుభాషపై మమకారం, అభిరుచి పెంచేందుకు నిర్వహించారని గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య టి. గౌరీశంకర్, ప్రముఖ కవులు రాధాశ్రీ, ఆచార్య ఫణీంద్ర, ఎం.దత్తాత్రేయశర్మ, పలువురు తెలుగు భాషాభిమానులు పాల్గొని సాంబిరెడ్డికి నివాళులర్పించారు.

## విద్యార్థినులు బాగా చదివి ఉన్నతస్థాయికి ఎదగాలి

**చిక్కడపల్లి, ఆగస్టు 2, ప్రభాతవార్త :** తెలంగాణ మైనారిటీస్ రెసిడెన్షియల్ జూనియర్ బాలికల కళాశాలలో విద్యార్థినులకు వివిధ రకాల సౌకర్యాల నిమిత్తం వస్తువుల పంపిణీ కార్యక్రమం ప్రిన్సిపాల్ శైలజ అధ్యక్షతన ఆదివారం జరిగింది. జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ ముఖ్య అతిథిగా, జిల్లా మైనార్టీ సంక్షేమాధికారిణి జి. కాంతమ్మ విశిష్ట అతిథిగా హాజరై పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించి ప్రసంగించారు. కళాశాలలో నెలకొన్న క్రమశిక్షణ, పరిశుభ్రత, విద్యా వాతావరణాన్ని అభినందించారు. విద్యార్థినులు నీట్, జేఈఈ, సివిల్ సర్వీసెస్ వంటి జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో రాణించి ఉన్నత స్థానాలు సాధించాలని ఆకాంక్షించారు. జిల్లా మైనార్టీ సంక్షేమాధికారిణి జి. కాంతమ్మ మాట్లాడుతూ తెలంగాణ మైనార్టీ సంక్షేమ నివాస విద్యాసంస్థలు నాణ్యమైన విద్యను అందిస్తున్నాయని పేర్కొన్నారు. ఐపీఈ లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినులను అతిథులు జ్ఞాపికలతో సన్మానించారు.

## ప్రశాంత వాతావరణంలో బోనాలు నిర్వహించుకోవాలి:సిఐ

**అఫ్జల్‌గంజ్, ఆగస్టు 2 ప్రభాతవార్త:** తెలంగాణ ఆషాడ మాసం బోనాల ఉత్సవాలను ఆలయ కమిటి ప్రతినిధులు, బస్తీవాసులు, భక్తులు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని కామాటిపూరా సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ సూచించారు. బోనాల సందర్భంగా పురానాపుల్ స్వామి వివేకనందనగర్ కనకదుర్గమ్మ ఆలయ కమిటి అధ్యక్షులు పోలె నాగేష్,కార్యదర్శి మాగి ప్రభాకర్, ఉపాధ్యక్షులు పి.మహేందర్, భద్రీ, మహాత్మాజ్యోతిరావు పూలే అధ్యక్షులు గురుచరణ్‌లు ఇన్‌స్పెక్టర్ ప్రసాద్‌ను కలిసి శాలువ కప్పి సన్మానించి బోనాల ఆహ్వానపత్రికను అందచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతియుతంగా బోనాల పండుగను జరుపుకోవాలన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేందుకు ప్రయత్నిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదే విధంగా స్టేషన్ పరిధిలోని ఆలయ కమిటి ప్రతినిధులు, బోనాల ఉత్సవాల నిర్వాహకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎస్.ఐ సుమన్, నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.



ఆహ్వానపత్రికను సిఐ ప్రసాద్‌కు అందచేస్తున్న ఆలయ కమిటి ప్రతినిధులు



మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ మక్బూల్‌జానీ

## నాగోల్‌లో సిసి కెమెరాలు ప్రారంభం

**ఎల్.బి.నగర్, ఆగస్టు 2, ప్రభాతవార్త:** మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా నిర్వహిస్తున్న నేను సైతం 2.0 కార్యక్రమంలో భాగంగా నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సహభావన అపార్ట్‌మెంట్స్ సి బ్లాక్‌లో ఏర్పాటు చేసిన 78 సీసీటీవీ కెమెరాలను నాగోల్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ మహమ్మద్ మక్బూల్‌జానీ, ఎస్ఐ సూర్య ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అపార్ట్‌మెంట్ నివాసితులకు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండటం, ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించడం, సీసీటీవీ కెమెరాలు నేరాల నియంత్రణలో పోషిస్తున్న కీలక పాత్రపై ఇన్‌స్పెక్టర్ మక్బూల్ జానీ అవగాహన కల్పించారు. ప్రజల భాగస్వామ్యంతో నేరాల నియంత్రణతో పాటు భద్రతను మరింత బలోపేతం చేయవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో సహభావన అపార్ట్‌మెంట్స్ అధ్యక్షుడు చి. శ్రీనివాస్‌రావు, ఉపాధ్యక్షురాలు బి.సంధ్యారాణి, ప్రధానకార్యదర్శి అబిద్‌హుస్సేన్, సలహాదారు జి.అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలి : ఎమ్మెల్యే



ఏటిసి సెంటర్ గాంధీ నగర్‌లో బోనాల ఉత్సవాల్లో ఎమ్మెల్యే శ్రీగణేష్

**కంటోన్మెంట్, ఆగస్టు 2 ప్రభాతవార్త:** తెలంగాణ సాంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బోనాల పండుగ అద్దంపడుతుందని కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ తెలిపారు. ఆదివారం సికింద్రాబాద్ ఉజ్జయిని మహాకాళి 5వ వార్డు గాంధీ నగర్‌లోని నల్లపోచమ్మ దేవాలయంలో నిర్వహించిన బోనాల వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీగణేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలంతా ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నట్లు ఆయన తెలిపారు. గాంధీ నగర్ నల్లపోచమ్మ దేవాలయం వ్యవస్థాపకులు గంట రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన బోనాల వేడుకలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

## చిలుకానగర్‌లో కొత్త డ్రైనేజీ నిర్మాణం చేట్టాలి

**ఉప్పల్, ఆగస్టు 2 ప్రభాతవార్త :** చిలుకానగర్ డివిజన్ పరిధిలోని న్యూ రాంనగర్ కాలనీలో నెలకొన్న డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారంగా కొత్త డ్రైనేజీ నిర్మాణ పనులు చేపట్టాలని కోరుతూ బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు శేఖర్ మాస ఆధ్వర్యంలో ఆదివారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మా రెడ్డిని కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా ఆయనకు వినతి పత్రం అందజేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ చిలుకానగర్‌లో డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉందని, సమస్య పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. త్వరలో కొత్త డ్రైనేజీ నిర్మాణ పనులు ప్రారంభించి సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో కాలనీ ప్రధానకార్యదర్శి నవీన్, బహుజన సమాజ్ పార్టీ సీనియర్ నాయకులు రాగిరి జ్ఞానేశ్వర్, బాలరాజు, సురేష్, అవినాష్‌యాదవ్, నబీ పాల్గొన్నారు.



ఎమ్మెల్యే లక్ష్మారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న బిఆర్ఎస్ నేత మాస శేఖర్

# ఆత్మ విశ్వాసానికి కళలు దోహదం

## సినీ దర్శకుడు తమ్మారెడ్డి భరద్వాజ



త్యాగరాయగానసభలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న సినీ దర్శకుడు తమ్మారెడ్డి భరద్వాజ

**చిక్కడపల్లి ఆగస్టు 2, ప్రభాతవార్త :** సంగీతం నాట్యం వంటి కళలు నేర్చుకోవడం వల్ల ఆత్మ విశ్వాసం కలిగి జీవితం లో అభివృద్ధి కి దోహదం చేస్తుందని ప్రముఖ దర్శకుడు తమ్మారెడ్డి భరద్వాజ చెప్పారు. ఆదివారం రాత్రి చిక్కడపల్లి త్యాగరాయ గానసభ ప్రధాన వేదిక పై భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యం తో రాజన్ సప్త స్వరాలు మ్యూజిక్ అండ్ కల్చరల్ అసోసియేషన్ నిర్వహణలో తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ నమోదు కోసం ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు పన్నెండు గంటల నిర్విరామ సంగీత నృత్య ప్రదర్శన జరిగింది తొమ్మిది మంది నాట్య గురువులు శిష్య బృందం జానపద శాస్త్రీయ నృత్యలను నర్తించారు. అక్షయ వల్లి శిష్య బృందం లలిత గీతలు మధురంగా ఆలపించారు. సంగమేశ్వరరావు బృందం అన్నమయ్య నాటకం ప్రదర్శించారు ఈ సందర్భంగా జరిగిన సభా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న తమ్మారెడ్డి భరద్వాజ మాట్లాడుతూ సంగీత నృత్య సాహిత్యాలు మనస్సుకు ఉల్లాసంతో పాటు జ్ఞానం క్రమశిక్షణ నేర్పుతాయి అన్నారు. సంగీతం నాట్యం అంటే సినిమా లో డబుల్ అర్థం పాటలు నృత్యాలు కావని చెప్పారు యువత నేడు పిచ్చి భ్రమలు లో ఉన్నారు అని వారికి వ్యాపకం కళలు సాహిత్యం అని పేర్కున్నారు వేదికపై తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రతినిధి అశోక్.కుమార్ సంస్థ స్థాపకుడు రాజన్‌కు రికార్డు నమోదు ధృవపత్రం బహుకరించారు. తెలంగాణ సచివాలయ ఉద్యోగుల సంఘం నాయకురాలు యామిని సంఖ్యా శాస్త్రవేత్త దైవజ్ఞ శర్మ వంశీప్రతాప్ ఏన్నం శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు కార్యదర్శి రోహిణి నివేదిక సమర్పించగా సభ్యులు సీతారామయ్య లక్ష్మణ్ పర్యవేక్షణ చేశారు.



బోనాల వేడుకల్లో పాల్గొన్న గుర్రం పవన్‌కుమార్‌గౌడ్ తదితరులు

## రేణుక ఎల్లమ్మ దేవాలయంలో ఘనంగా బోనాలు

**సికింద్రాబాద్, ఆగస్టు 2 ప్రభాతవార్త:** పద్మారావు నగర్‌లోని శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయంలో హరి చారి, సాయిరాం చారిల ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన బోనాల ఉత్సవాలు ఎంతో ఘనంగా జరిగాయి. వందలాదిగా భక్తులు పాల్గొని ఎంతో భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లష్కర్ జిల్లా సాధన సమితి అధ్యక్షుడు గుర్రం పవన్ కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## అమ్మవారిని దర్శించుకుంటే కోరిన కోర్కెలు నెరవేరుతాయి



అమ్మవారికి బోనాలు సమర్పిస్తున్న మార్కెట్ చైర్మన్ అనంద్ బాబు

**కంటోన్మెంట్, ఆగస్టు 2 ప్రభాతవార్త:** అమ్మవారిని దర్శించుకుంటే కోరిన కోర్కెలు నెరవేరుతాయని బోయిన్‌పల్లి మార్కెట్ చైర్మన్ ఆర్.ఆనంద్ బాబు తెలిపారు. ఆషాడమాస బోనాల ఉత్సవాలను పురస్కరించుకొని ఆదివారం బోయిన్‌పల్లి మార్కెట్‌లో నిర్వహించిన బోనాల వేడుకల్లో మార్కెట్ చైర్మన్ ఆర్.ఆనంద్‌బాబు, వైస్ చైర్మన్ డి.బి.దేవేందర్, మార్కెట్ కార్యదర్శి వెంకటేశ్వర్లు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా నిర్వహించిన తొట్టెల ఊరేగింపు, బోనాల వేడుకల్లో వారు ఉత్సాహంగా పాల్గొని పూజలు నిర్వహించారు.

## డబ్బుకంటే స్నేహితుడే ముఖ్యం : జంపనప్రతాప్



ఫ్రెండ్‌షిప్ డేదినోత్సవ వేడుకల్లో పాల్గొన్న జంపన ప్రతాప్

**కంటోన్మెంట్, ఆగస్టు 2 ప్రభాతవార్త:** డబ్బుకంటే స్నేహితుడే గొప్ప సంపదని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ తెలిపారు. ఫ్రెండ్‌షిప్ డేను పురస్కరించుకొని ఆదివారం బోయిన్‌పల్లి ప్లే గ్రౌండ్‌లో నిర్వహించిన వేడుకల్లో ఆయన పాల్గొని తన స్నేహితులకున ఫ్రెండ్‌షిప్ బ్యాండ్ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు సాయిబాబాయాదవ్, కరన్‌సింగ్, సురేష్, వాసుగౌడ్, మధు, సూధకర్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## బోనాల జాతర ఉత్సవాల బ్రోచర్ ఆవిష్కరణ

**చార్మినార్, ఆగస్టు 1 ప్రభాతవార్త :** పాతబస్తీ మహారాజ్‌గంజ్‌లోని శ్రీ పైనీరు ముత్యాలమ్మ దేవాలయంలో అత్యంత వైభవంగా ఆషాడ మాస బోనాల జాతర ఉత్సవాలను నిర్వహించనున్నామని దేవాలయం కమిటి చైర్మన్ దోరేటి ఆనంద్ గుప్త తెలిపారు. దూద్‌బౌలి మహారాజ్‌గంజ్‌లోని శ్రీ పైనీరు ముత్యాలమ్మ దేవాలయంలో శనివారం జరిగిన కార్యక్రమంలో బోనాల జాతర ఉత్సవాలకు సంబంధించిన బ్రోచర్‌ను బిజెపి ఓబిసి నేషనల్ మీడియా కో ఆర్డినేటర్ పెరక సురేష్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో దేవాలయం కమిటి చైర్మన్ ఆనంద్ గుప్త, అధ్యక్షులు కట్ట వెంకటచలం ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి నరసింహ ముదిరాజ్, కోశాధికారి బుస్తా సంతోష్, ఉపాధ్యక్షులు వనభోజ శ్రీనివాస్ చారి, గుండ్లపల్లి సుధాకర్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

## గోల్కొండ జగదాంబ మహంకాళికి ఆరవ పూజ

**మెహిదీపట్నం, ఆగస్టు 2, ప్రభాతవార్త :** గోల్కొండ కోట శ్రీ జగదాంబ మహంకాళి (ఎల్లమ్మతల్లి)కి బోనాల ఉత్సవాలలో భాగంగా ఉత్సవ కమిటీ సభ్యులు ఆరవ పూజను ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ ఆకుల చంద్రశేఖర ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం మందకొడిగా కొనసాగినప్పటికీ మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు వేల సంఖ్యలో భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. మహిళలు బోనాలు అమ్మవారికి సమర్పించారు. అంతేకాకుండా వారి వారి మొక్కులను భక్తులు చెల్లించుకున్నారు. ఈ బోనాల ఉత్సవాలతో గోల్కొండ కోట భక్తులతో కోలాహలంగా మారింది.

## కాంట్రాక్టర్లు టెండర్లలో పాల్గొనకపోవటం శోచనీయం

**చాంద్రాయణగుట్ట, ఆగస్టు 2, ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర పండుగ బోనాల ఉత్సవాల సందర్భంగా జీహెచ్ఎంసి చార్మినార్, రాజేంద్రనగర్ జోన్ల పరిధిలోని ఎలక్ట్రిక్ కాంట్రాక్టర్లు టెండర్లలో పాల్గొనక పోవటం అత్యంత శోచనీయమని భారతీయ జనతా పార్టీ భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షులు పొన్న వెంకటరమణ ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రజల సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగకు ప్రభుత్వం పెద్దఎత్తున ఏర్పాట్లు చేయాల్సిన అవసరం ఉందన్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు స్వాగత వేదికల ఏర్పాటుకు జీహెచ్ఎంసీ అనుమతులు ఇచ్చి టెండర్లు చేపట్టిందని, టెండర్లలో కాంట్రాక్టర్లు పాల్గొనకపోవడం వల్ల తిరిగి రీటెండర్లు నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడుతోందన్నారు. ఎలక్ట్రికల్ పనులకు సంబంధించిన టెండర్లలో స్పందనలేకపోవడం దారుణమన్నారు. జీహెచ్ఎంసి ఉన్నతాధికారులు స్పందించి ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్లు బాధ్యతాయుతంగా టెండర్లలో పాల్గొని, ఉత్సవాల విజయవంతం చేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో భవిష్యత్తులో చట్టపరమైన మార్గాల్లో పోరాటం చేయాల్సి వస్తుందని స్పష్టం చేశారు.

## 17న దేశవ్యాప్తంగా బిఎంఎస్ నిరసనలు

**హైదరాబాద్, ఆగస్టు 2, ప్రభాతవార్త:** దేశంలోని శ్రామిక వర్గం సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 17న అన్ని జిల్లా కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) నిర్ణయించింది. ఈ మేరకు ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లో బిఎంఎస్ కేంద్ర కార్యాలయంలో సంఘ్ జోనల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ వి.రాధాకృష్ణన్ వివరాలు వెల్లడించారు. బీఎంఎస్ అఖిల భారత అధ్యక్షుడు ఎస్.మల్లేశం అధ్యక్షతన ఆదివారం జరిగిన జాతీయ కమిటీ సమావేశంలో ఈ మేరకు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి సురేంద్ర కుమార్ పాండే, ఆర్గనైజింగ్ సెక్రటరీ బి. సురేంద్రన్, మాజీ అఖిల భారత అధ్యక్షులు సి. కె. సాజి నారాయణన్, శ్రీ హిరణ్మయ్ పాండ్య, దేశవ్యాప్తంగా ఉన్న పలువురు నాయకులు పాల్గొని కార్మిక సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. దేశంలో కార్మికుల కనీస వేతనాన్ని నెలకు 30 వేలుగా నిర్ణయించాలి. ఈఎస్ఐసి ప్రస్తుత వేతన పరిమితిని రూ. 21 వేల నుండి రూ. 42 వేలకు పెంచాలి. ఈపీఎఫ్ వేతన పరిమితిని రూ. 15 వేల నుండి రూ. 30 వేల కు పెంచాలి. కనీస ఈపీఎఫ్ పింఛనును నెలకు వెయ్యి నుండి రూ.7,500కు పెంచాలి. గ్రాట్యుటీ గరిష్ట పరిమితిని రూ. 20 లక్షల నుండి రూ.40 లక్షలకు పెంచాలి. బోనస్ అర్హత వేతన పరిమితిని రూ. 21 వేల నుండి రూ. 42 వేలకు, లెక్కింపు గరిష్ట పరిమితిని రూ 7 వేల నుండి రూ.18 వేలకు పెంచాలని డిమాండ్ చేసారు. ఆగస్టు 17న జరిగే ఈ దేశవ్యాప్త నిరసన కార్యక్రమంలో కార్మికులు, ఉద్యోగులు, కాంట్రాక్ట్ మజ్దూర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని బిఎంఎస్ పిలుపునిచ్చింది.



మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే వివేకానంద్

## ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలి

**ఎమ్మెల్యే వివేకానంద్**

**కొంపల్లి, ఆగస్టు 2, ప్రభాతవార్త :** సిఎంసి కొంపల్లి సర్కిల్ పరిధిలోని వీజీ హోమ్స్‌లో బ్రైట్ చైల్డ్ ఫౌండేషన్, వీజీ హోమ్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన మొక్కల నాటే కార్యక్రమంలో బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ముఖ్యఅతిథిగా పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్న బ్రైట్ చైల్డ్ ఫౌండేషన్, వీజీ హోమ్స్ వాసులను అభినందించారు. పిల్లల బంగారు భవిష్యత్తు కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటి సంరక్షణకు కట్టుబడి ఉండాలని పిలుపునిచ్చారు. అనంతరం ఫ్రెండ్‌షిప్ డే సందర్భంగా కాలనీలోని చిన్నారులు ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌కు ఫ్రెండ్‌షిప్ బ్యాండ్ కట్టగా, ఆయన కేక్ కట్ చేసి చిన్నారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలం యాదవ్, పాక్స్ వైస్ చైర్మన్ రవీందర్ రెడ్డి, మహిళా అధ్యక్షురాలు సంగీతా రెడ్డి, నాయకులు పూజారి లక్ష్మణ్ గౌడ్, భూ లక్ష్మణ్, వాసుదేవ్ రెడ్డి, కిట్టు, బ్రైట్ చైల్డ్ ఫౌండేషన్ ప్రతినిధులు, వీజీ హోమ్స్ కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## నాలా బ్రిడ్జిని ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే



పనులను ప్రారంభిస్తున్న శ్రీశైలంగౌడ్

**పేట్‌బషీరాబాద్, ఆగస్టు 2, ప్రభాతవార్త :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని గాజులరామారం సర్కిల్ న్యూషాపూర్‌నగర్‌లో నూతనంగా నిర్మించిన నాలా బ్రిడ్జిని ఆదివారం మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నాయకుడు కూన శ్రీశైలంగౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకుడు కూన రాఘవేందర్‌గౌడ్ సొంత నిధులతోపాటు కాలనీ వాసుల సహకారంతో రూ.10 లక్షల వ్యయంతో నిర్మించిన ఈ నాలా బ్రిడ్జి ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా మారిందన్నారు. ఎన్నో ఏళ్లుగా నాలా కారణంగా స్థానికులు, ముఖ్యంగా వర్షాకాలంలో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కూన రాఘవేందర్ గౌడ్, నాగిల్ల శ్రీనివాస్, చౌడ శ్రీనివాస్, నారాయణ గౌడ్, మక్బుల్, కాలనీవాసులు ఫెరోజ్, అలీముద్దీన్, మహమ్మద్ మైన్, అజ్జు పటేల్, ఆరిఫ్, షకీల్, నయీమ్, ఖలీమ్, మోహన్, బాలమణి తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో స్థానికులు పాల్గొన్నారు.

## బోనాల వేడుకలపై కమిటీలతో ఇన్‌స్పెక్టర్ సమావేశం



ఉత్సవ కమిటీలతో సమావేశమైన ఇన్‌స్పెక్టర్ వెంకటరెడ్డి తదితరులు

**జూబ్లీహిల్స్, ఆగస్టు 2, ప్రభాతవార్త :** రాబోయే బోనాల పండుగ సందర్భంగా ఖైరతాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఉత్సవ నిర్వాహకులు, శాంతి కమిటీ సభ్యులు, బస్తీ పెద్దలతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. బోనాల పండుగను శాంతియుతంగా, సజావుగా నిర్వహించేందుకు పోలీసు శాఖకు పూర్తి సహకారం అందించాలని, సామాజిక సామరస్యాన్ని కాపాడాలని, అనుమానాస్పద వ్యక్తులు, కార్యకలాపాలు లేదా శాంతిభద్రతలకు భంగం కలిగించే ఏవైనా విషయాలపై వెంటనే తమకు సమాచారం అందించాలని ఖైరతాబాద్ ఇన్‌స్పెక్టర్ బి.వెంకటరెడ్డి కోరారు. దీనివల్ల ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవచ్చన్నారు. నిర్వాహకులు పోలీసుశాఖకు పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే ఫ్లెక్సీ బ్యానర్ల ఏర్పాటుచేయవద్దని, డీజే సౌండ్ సిస్టమ్‌లు ఉపయోగించవద్దని సూచించారు. అడ్మిన్ ఎస్ఐ ఎండి సమీర్ పాల్గొన్నారు.

## మూసాపేట్‌లో ఘనంగా బొడ్రాయి అభిషేకం

**కెపిహెచ్‌బి కాలనీ, ఆగస్టు 2, ప్రభాతవార్త :** కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలోని మూసాపేట్‌లో బొడ్రాయి అభిషేక కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో బొడ్రాయి ప్రతిష్ట దాతలు దివంగత తూము నర్సింగ్‌రావు, రామ్నార శంకరయ్యగౌడ్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. బొడ్రాయి పండుగను పురస్కరించుకొని మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు శైలేష్ కుమార్, సప్పిడి శ్రీనివాసరావు, గురజాల రమేష్, నోముల ప్రకాష్ పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్‌పై నిర్లక్ష్యం వద్దు: డాక్టర్ రవిశేఖర్‌రెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 2, ప్రభాతవార్త :** ఓటు మన హక్కు, మన భవిష్యత్తు నిర్ణయించేదని ఎస్ఐఆర్‌పై ఎవరు నిర్లక్ష్యం వహించొద్దని ఏఐసీసీ జాతీయ కోఆర్డినేటర్ డాక్టర్ పి.వి.రవిశేఖర్‌రెడ్డి అన్నారు. మధురానగర్ కాలనీ సంక్షేమ సమితి ఆధ్వర్యంలో సాగి రామకృష్ణంరాజు కమ్యూనిటీహాల్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కేంద్రాన్ని సందర్శించి కేంద్రములో జరుగుతున్న ఓటరు నమోదు, వివరాల సవరణ,దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను పరిశీలించి, కేంద్ర నిర్వహణపై అక్కడ ఉన్న బిఎల్‌వోలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఇంటికి వెళ్లి అర్హులైన ప్రతి ఓటరు సందేహాలను నివృత్తి చెయ్యాలని పారదర్శకంగా వేగవంతంగా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని బీఎల్‌వో, బీఎల్ఏలను కోరారు. కార్యక్రమములో బీఎల్‌వోల సూపర్వైజర్ బిక్యానాయక్, నవీనా, కవిత, రవి,సాయి కుమార్, వాహెబ్‌లు పాల్గొన్నారు. అనంతరం డాక్టర్ రవిశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల ప్రచార తరహాలో సర్ పై క్షేత్ర స్థాయిలో ఫోకస్ పెట్టాలని, ఎవరు నిర్లక్ష్యం వహించొద్దని కాంగ్రెస్ కార్యకర్తలను కోరారు. సీఎం రేవంత్ రెడ్డి,ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్ ఎస్ఐఆర్‌ను సీరియస్‌గా పర్యవేక్షిస్తూ రోజు సూచనలు చేస్తున్నారని అన్నారు. వారి సూచనలకు అనుగుణంగా ప్రతి ఒక్క ఓటరు ఎన్యుమరేషన్ ఫారంను నింపి బీఎల్ఓలకు అందజేసేలా ప్రతి కాంగ్రెస్ కార్యకర్త కృషి చెయ్యాలన్నారు.



బీఎల్‌వో నుంచి సర్ వివరాలు తెలుసుకుంటున్న రవిశేఖర్‌రెడ్డి

# వైభవంగా ప్రారంభమైన మహాకాళీ బోనాల జాతర

**తొలి (బంగారు) బోనం, పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రి పొన్నం....డప్పు చప్పుళ్లు,పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల నృత్యాలతో సందడిగా జాతర**





**బేగంపేట, ఆగస్టు 2, ప్రభాతవార్త**

సికింద్రాబాద్ శ్రీఉజ్జయినీ మహాకాళీ అమ్మవారి ఆషాడ బోనాల జాతర అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. డప్పుచప్పుళ్లు, పోతురాజుల నృత్యాలు, శివసత్తుల పూనకాలతో జాతర హోరెత్తింది. ఉదయం నుంచే అమ్మ వారిని దర్శించుకునేందుకు జంటనగరాలతోపాటు వివిధ రాష్ట్రాలు, దేశ, విదేశాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. దీంతో ఆలయ పరిసరాలతో పాటు క్యూలైన్లలో భక్తుల రద్దీకొనసాగింది. అమ్మవారికి ఆదివారం తెల్లవారు జామునే మహా మంగళ హారతి ఇచ్చారు. మంత్రి పొన్నం ప్రభాకర్, మంజుల దంపతులు (తొలి బంగారు) బోనం, పట్టు వస్త్రాలను అమ్మ వారికి సమర్పించారు. అనంతరం సాధారణ భక్తులకు అనుమతిచ్చారు. బోనాల జాతర సందర్భంగా అమ్మవారి ఆలయాన్ని కలకత్తా(పూల) డెకరేషన్‌తో అందంగా అలంకరించారు. వివిధ రకాలైన విద్యుద్దీపాల వెలుగులో అమ్మ వారి ఆలయం నూతన శోభతో ధగధగా మెరిసిపోయింది. ఒకవైపు ప్రముఖులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకోగా మరో వైపు సాధారణ భక్తులు బోనం,సాకతో ఆలయానికి తరలి వచ్చారు. దీంతో ఆలయంవద్ద రద్దీ కొనసాగింది. ఉదయం 5 గంటల నుంచే భక్తులు అమ్మవారి దర్శనం కోసం క్యూలో బారులుతీరారు. బోనాలు సమర్పించే భక్తుల కోసం ఏర్పాటుచేసిన ప్రత్యేక క్యూలైన్లలో మహిళలు పెద్దఎత్తున బారులుతీరారు. గతంలో ఎన్నడూ రానంతగా భక్తులు ఈ ఏడాది అమ్మ వారి దర్శనానికి పోటెత్తారు. క్యూలైన్లలో నిల్చి ఉన్న భక్తులకు సుమారు 4గంటల సమయం పట్టడంతో అసహనం వ్యక్తం చేసారు.

**అమ్మ వారిని దర్శిచుకున్న ప్రముఖులు...**

ఆదివారం ఉదయం శ్రీఉజ్జయినీ మహాకాళీ అమ్మవారిని పలువురు రాజకీయ నేతలు, ప్రముఖులు దర్శించుకుని పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున పొన్నం ప్రభాకర్, మంజుల దంపతులు బోనం, పట్టు వస్త్రాలు సమర్పించగా అనంతరం మంత్రి కొండా సురేఖ, సీతక్కలు బోనం, పట్టు వస్త్రాలు సమర్పించారు. హైదరాబాద్ నగర పోలీసు కమిషనర్ వి.సి.సజ్జనార్ కుటుంబం బోనంతో ఆలయానికి వచ్చి అమ్మవారికి బోనం సమర్పించి పూజలు నిర్వహించారు. అనంతరం కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్, రాజ్యసభ సభ్యులు లక్ష్మణ్, మాజీ మేయర్ బండ కార్తీక చంద్రారెడ్డి దంపతులు, మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్‌యాదవ్, మల్లారెడ్డి, ఎమ్మెల్యేలు ముఠా గోపాల్, మర్రి రాజశేఖర్‌రెడ్డి, సినీనటి వైష్ణవి చైతన్య బోనం ఎత్తుకుని వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. హైదరాబాద్‌లోని అమెరికన్ కాన్సులేట్ జనరల్ డైరెక్టర్ లారా విలియమ్స్ తదితరులు అమ్మవారికి పూజలు చేసారు. తెలంగాణా ఆధ్యాత్మిక సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలిచే శ్రీఉజ్జయినీ మహాకాళీ అమ్మవారి బోనాల జాతర ఉత్సవాల్లో అమెరికన్ కాన్సుల్ జనరల్ లారా విలియమ్స్ పాల్గొన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక ఆహ్వానం మేరకు వేడుకలకు విచ్చేసిన ఆమెకు మంత్రి ఘనస్వాగతం పలికారు. ఆమె సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ విశిష్టత, బోనాలపండుగ ఆధ్యాత్మిక సాంస్కృతిక ప్రాధాన్యత గురించి మంత్రి పొన్నం ప్రభాకర్ ఆమెకు వివరించారు. మంత్రి పొన్నం మాట్లాడుతూ ఈ జాతర ప్రజల భక్తివిశ్వాసాలకు, సాంస్కృతిక వైభవానికి అద్దం పడుతుందన్నారు. బోనం సమర్పణ అనంతరం నిర్వహించే సంప్రదాయ రంగం కార్యక్రమం విశిష్టతను కూడా కాన్సుల్ జనరల్‌కు పొన్నం వివరించారు. అమెరికా కాన్సుల్ జనరల్ బోనాల ఉత్సవాల్లో పాల్గొనడం తెలంగాణా, అమెరికా మధ్య సాంస్కృతిక సంబంధాలను మరింత బలోపేతం చేస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేసారు. వివిఐపీలు అమ్మవారి దర్శనానికి వచ్చిన సమయంలో బోనాల లైన్లలో వేచి ఉన్న మహిళలు, సాధారణ క్యూలో వేచిఉన్న భక్తులు కొంత అసహనానికి గురయ్యారు. క్యూ లైన్లలో ఉన్న వారు కొందరు తీవ్ర ఒత్తిడికి గురై అస్వస్తతకుగురయ్యారు. స్పందించిన వైద్య సిబ్బంది వారికి సకాలంలో సపర్యలుచేసారు. ఆలయ ప్రాంగణంలో చెత్త కుప్పలు పేరుకు పోవడంపై భక్తులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసారు. ఆలయానికి చేరుకునే ప్రధాన ఎంట్రన్స్ వద్ద పోలీసులకు భక్తులకు తీవ్ర వాగ్వాదం నెలకొనడం భక్తులను అసహనానికి గురిచేసింది. జోగిని బాధపడటం రాష్ట్రానికి మంచిదికాదని, జోగినిలు ఆందోళనలకు దిగారు. జోగిని శ్యామల నిషా క్రాంతిలతో పాటు పోలీసుల చర్యలతో తమ బోనాలు కింద పడిపోయాయంటూ భోరున విలపించారు. తమను పోలీసులు ఇబ్బందులకు గురిచేసారంటూ ఆవేదన వ్యక్తం చేసారు. ఏసీపీ భక్తులతో దురుసుగా వ్యవహరించడం కనిపించింది. సాక కింద పడిపోయిందని, మహిళా భక్తులు తిట్టుకుంటూ వెళ్లారు. ముఖ్యమంత్రి ఆలయ ప్రాంగణం నుంచి బయటకు వెళ్లిన తర్వాత ఒక్కసారిగా భక్తులు ఆర్చ్‌గేట్ వద్ద ఒక్కారిగా లోపలికి తోసుకుంటూ వచ్చారు. సాయంత్రం ఫలహారం బండ్ల ఊరేగింపు కొనసాగింది.



మాట్లాడుతున్న బిఆర్ఎస్ నేత రేషం మల్లేష్

## ఇందిరమ్మ ఇళ్ల పథకంలో ముషీరాబాద్‌కు మొండిచేయి

**చిక్కడపల్లి, ఆగస్టు 2 ప్రభాతవార్త :** ఇందిరమ్మ ఇళ్ల పథకంలో ముషీరాబాద్ నియోజకవర్గానికి కాంగ్రెస్‌ప్రభుత్వం మొండిచేయి చూపిందని తెలంగాణ ఉద్యమకారులు, బీఆర్ఎస్ నాయకులు తీవ్రస్థాయిలో విమర్శించారు. ఆదివారం రాంనగర్‌లో తెలంగాణ ఉద్యమకారులు, బిఆర్ఎస్ నేత రేషం మల్లేష్ ఏర్పాటు చేసిన మీడియా ప్రతినిధుల సమావేశంలో వారు మాట్లాడారు. ఎన్నికల సమయంలో ప్రతి పేద కుటుంబానికి ఉచిత ఇల్లు అందిస్తామని గొప్పలు చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మాట తప్పిందని ఆరోపించారు. ముషీరాబాద్ నియోజకవర్గాన్ని ఉద్దేశపూర్వకంగానే నిరక్ష ్యం చేస్తూ, పేదల ఆశలపై నీళ్లు చల్లిందని విమర్శించారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం పేరుతో రూ.6 లక్షల లబ్ధిదారుల వాటా, రూ.10 వేల దరఖాస్తు రుసుము విధించడం వల్ల ఈ పథకం నిజమైన పేదలకు అందని ద్రాక్షగా మారిందని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ముషీరాబాద్ నియోజకవర్గానికి 360 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను పూర్తిగా ఉచితంగా అందిం చామని, అదే పేదలపట్ల తమ ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారులు, నాయకులు కల్వ గోపి, నేత శ్రీనివాస్, అజయ్‌ముదిరాజ్, చిట్టిశ్యాంసుందర్, సిరిగిరి శ్యామ్, పున్న సత్యనారాయణ, బండా యుగేందర్, కొండ మాధవ్, వెంకట్రావు పాల్గొన్నారు.

## రాబోయే ఎన్నికల్లో టిఆర్ఎస్ జెండాను ఎగరేస్తాం



కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించిన వాసిలి చంద్రశేఖర్‌ప్రసాద్

**వాసిలి చంద్రశేఖర్ ప్రసాద్**

**శేరిలింగంపల్లి, ఆగస్టు 2 ప్రభాతవార్త :** రాబోయే ఎన్నికల్లో శేరిలింగంపల్లి నియోజక వర్గంలో టిఆర్ఎస్ జెండా ఎగురేస్తామని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వాసిలి చంద్రశేఖర్ ప్రసాద్ ధీమా వ్యక్తం చేశారు. వాసిలి చంద్రశేఖర్ ప్రసాద్ ఆధ్వర్యంలో చందానగర్, మియాపూర్ డివిజన్లకు చెందిన పలువురు కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలకు చెందిన కార్యకర్తలు 30మందికి పైగా తెలంగాణ రక్షణ సేన పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. టిఆర్ఎస్‌పార్టీలో చేరిన కార్యకర్తలకు వాసిలి చంద్రశేఖర్ ప్రసాద్ పార్టీ కండువాలతో సాదరంగా ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ ప్రసాద్ మాట్లాడుతూ, రాష్ట్రంలో తెలంగాణ రక్షణ సేనపార్టీ బలోపేతమవుతుందని, భవిష్యత్తులో జరగబోయే జీహెచ్ఎంసీ ఎన్నికల్లోనూ, 2028లో జరగబోయే అసెంబ్లీ ఎని ్నకల్లోనూ టిఆర్ఎస్ పార్టీ అధిక సీట్లు సాధించి అధికారంలోనికి రావడం ఖాయమన్నారు. పార్టీలో చేరిన వారిలో బిజిలి ప్రవీణ్, రాంభూపాల్‌రెడ్డి, సూర్యప్రకాశరావు, నవీన్, శ్రీకాంత్, నాగేశ్,రాజు, శ్రవణ్,బంటీ ఉన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ ముఖ్య నాయకులు విష్ణు, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

## నవరసభరితం రమాదేవి దాదినమ్మ కలాపం నృత్యరూపకం

**రవీంద్రభారతి, ఆగస్టు 2 ప్రభాతవార్త :** అల్లంపాటి అగస్త్యుడు రచించిన అలనాటి అరుదైన అపురూప అద్భుత కళారూపం నీలావతి విజయం యక్షగానాన్ని కూచిపూడి భాగవతులు దాదినమ్మ అనే వేషకథగా రూపొందించి దాదినమ్మ కలాపం పేరున రూపొందించి అద్భుతంగా ప్రదర్శించి నవరసాలు ఒలికించి ఆకట్టుకుంది. నీలావతి తన జీవితంలో ఎదురైన దురదృష్టాన్ని తలచుకుంటూ వేదనతో విలపిస్తూ తన గోడును తానే చెప్పుకునే స్వగత రూపంలో ఈ దాదినమ్మ కలాపం నృత్యరూపకం ఆద్యంతం సాగింది. భారతీయ నాట్య సంప్రదాయంలో దీనిని గోడు చెప్పుకోవడం అనే ఏకపాత్రిభినయ స్వరూపంగా చెప్పబడింది. ఈ దాదినమ్మ కలాపం నృత్యరూపకాన్ని ప్రఖ్యాత నాట్యగురువు, యక్షగాన కంఠీరవ డా. పి.రమాదేవి నడుముకు మంచాన్ని కట్టుకొని ప్రదర్శించడం విశేషం. దాదినమ్మ కలాపం సూత్రధారిగా డా. పి.రమాదేవి ప్రదర్శనకు నట్టువాంగం శ్రీధరాచార్య, గాత్రం స్వేతప్రసాద్, మృదంగం శ్రీధరాచార్య, వయోలిన్ కె.సాయికుమార్, వేణువు ఉమా వెంకటేశ్వర్లు అద్భుత వాద్యసహకారం అందించి దాదినమ్మ కలాపం నృత్యరూపకాన్ని మరింత రక్తికట్టించారు. శ్రీసాయి నటరాజ అకాడమీ ఆఫ్ కూచిపూడి డాన్స్ గురు డా. పి.రమాదేవి తల్లిని స్మరించుకుంటూ ఇస్తున్న 11వ మీనాక్షి అమ్మ అవార్డు ప్రదానోత్సవం రవీంద్రభారతి ప్రధాన మందిరంలో వైభవోపేతంగా జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథులుగా విచ్చేసిన రాఘవాచారి, వసంత్‌కిరణ్, కళాకృష్ణ, శృతిచంద్రశేఖర్, డా. పి.రమాదేవిలు నాట్యసంగీత కేంద్ర త్రివేండ్రం డైరెక్టర్, కేంద్ర సంగీత నాటక



ఉజ్జయిని మహాకాళి అమ్మవారిని దర్శించుకున్న బండి రమేష్ దంపతులు

## మహంకాళి అమ్మవారిని దర్శించుకున్న బండి రమేష్ దంపతులు

**కెపిహెచ్‌బి కాలనీ, ఆగస్టు 2, ప్రభాతవార్త :** ఆషాధ మాస బోనాల మహోత్సవాల సందర్భంగా, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జి, టీపీసీసీ ఉపాధ్యక్షులు రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ సతీమణితో కలిసి సికింద్రాబాద్‌లోని ప్రసిద్ధ ఉజ్జయిని శ్రీ మహంకాళి అమ్మవారి దేవాలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పుష్పరెడ్డి, రమేష్, అస్లాం, విశాల్, బాలు, అనిల్, సతీష్, రవి తదితరులు పాల్గొన్నారు.

## మహంకాళి బోనాలు తొట్టెల ఊరేగింపు

**కెపిహెచ్‌బి కాలనీ, ఆగస్టు 2, ప్రభాతవార్త :** మూసాపేట్ డివిజన్ కురుమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఆషాధ మాస మహంకాళి అమ్మవారి బోనాల మహోత్సవం తొట్టెల ఊరికింపు కార్యక్రమం భక్తిశ్రద్ధలతో, వైభవంగా జరిగింది. ఈమహోత్సవానికి బీజేపీ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వాదాలు పొందారు. ఈ సందర్భంగా కురుమ సంఘం అధ్యక్షులు మొక్కెర ఐలయ్య ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు రాజేశ్వరరావుకి ఘనస్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. అనంతరం తొట్టెల ఊరేగింపు మహోత్సవంలో వడ్డేపల్లి రాజేశ్వరరావు భక్తులతో కలిసి పాల్గొన్నారు. ఊరేగింపును మరింత శోభాయమానంగా తీర్చిదిద్దారు. ఈ కార్యక్రమంలో కురుమ సంఘం కమిటీ సభ్యులు ఇంద్ర ప్రకాష్, ప్రధాన కార్యదర్శి కేబుల్ శ్రీనివాస్, అశోక్, రాజు, శ్రీహరి, రవి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## కాలం మారినా స్నేహం మారదు : వడ్డేపల్లి రాజేశ్వరరావు

**కెపిహెచ్‌బి కాలనీ, ఆగస్టు 2, ప్రభాతవార్త :** అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర బీజేపీ సీనియర్ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు ఆదివారం చిన్ననాటి స్నేహితులను కలుసుకున్నారు. ఈ సందర్భంగా చిన్ననాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ స్నేహితులతో ఎంతో ఆత్మీయంగా, ఆనందంగా కొంతసేపు గడిపారు. జీవితంలో ఎన్నో మార్పులు వచ్చినా, నిజమైన స్నేహం మాత్రం కాలంతోపాటు మరింత బలపడుతుందని స్నేహమేరా జీవితం స్నేహమేరా శాశ్వతం అని రాజేశ్వరరావు పేర్కొన్నారు. స్నేహితులతో కలిసి సరదాగా నవ్వులు పంచుకుంటూ, పాత అనుభవాలను గుర్తుచేసుకుంటూ గడిపిన ఆ క్షణాలు జీవితాంతం గుర్తుండి పోతాయని అన్నారు. ఈ సందర్భంగా స్నేహితుల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అందరూ కలిసి స్నేహబంధాన్ని మరింత బలోపేతం చేసుకుంటూ పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

## పలు ఆలయాలల్లో బోనాల పూజలు ప్రారంభం

**బేగంబజార్, ఆగస్టు 2 ప్రభాతవార్త:** ఆషాడ మాసం బోనాల ఉత్సవాలను పురస్కరించుకుని ప్రతి యేటా మాదిరిగానే ఈయేడు కూడా కోఠిలోని వజ్ర మైసమ్మ విజయ దుర్గ సహిత మల్లేశ్వర స్వామి దేవాలయంలో జరిగిన బోనాల పండుగ పూజలను గోషామహల్ నియోజకవర్గం బిఆర్ఎస్ ఇన్‌చార్జ్ ఆర్వీమహేందర్‌కుమార్ పాల్గొన్ని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో శంకర్‌చారి, నవీన్,ప్రశాంత్,జగదీష్‌గుప్త తదితరులు పాల్గొన్నారు.

**కనకదుర్గమ్మ ఆలయంలో పూజలు...**

పురానాపూల్ స్వామి వివేకనందనగర్‌లోని కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారి ఘట్టాల పూజలు ప్రారంభమయ్యాయి. శనివారం రాత్రి నుంచి ఆదివారం తెల్లవారు జాము వరకు అమ్మవారి దేవాలయంలో అమ్మవారి గీతాలను ఆలపించారు. ఈకార్యక్రమంలో నిర్వాహకులు శ్వేత, పోలే నాగేష్, మాగి ప్రభాకర్, పి.మహేందర్, బస్తీ సంఘం అధ్యక్షులు ఎంపి సదానంద్, వందలాది నవ యువకులు పాల్గొన్నారు. అమ్మవారి ఘట్టాన్ని పురవీధులో శోభయాత్రగా నిర్వహించగా భక్తులు సాకాలు, అమ్మవారిక వడిబియ్యం పోశారు. ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

## మహంకాళి ఆలయంలో పూజల్లో పాల్గొన్న వియజారెడ్డి

**జూబ్లీహిల్స్, ఆగస్టు 2, ప్రభాతవార్త :**

సికింద్రాబాద్‌లోని మహంకాళి ఆలయంలో బోనాల ఉత్సవాల్లో మాజీ కార్పొరేటర్ విజయారెడ్డి పాల్గొన్నారు. ఇక్కడ నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో ఆమె పాల్గొని అమ్మవారి ఆశీస్సులు తీసుకున్నారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని కోరినట్లు తెలిపారు.



ఆలయంలో అమ్మవారి ఆశీస్సులు తీసుకుంటున్న విజయారెడ్డి



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న దృశ్యం

## కళాకారుల బోనాల జాతరకు ఏర్పాట్లు

**నిజాంపేట్, ఆగస్టు 2, ప్రభాతవార్త :** ఆగస్టు 7న గాజులరామారంలోని పద్మావతి కన్వెన్షన్‌లో నిర్వహించనున్న కుత్బుల్లాపూర్ కళాకారుల బోనాల జాతరను విజయవంతం చేయాలని తెలంగాణ కళాకారుల గళాల వేదిక ప్రతినిధులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ప్రభుత్వ సలహాదారు దరువు అంజన్న మాట్లాడుతూ రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి వివిధ జానపద కళారూపాలకు చెందిన కళాకారులు ఈ వేడుకలో పాల్గొంటారని తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఈ జాతరలో సుమారు 200 మంది కళాకారులు తమ కళా ప్రదర్శనలతో ప్రేక్షకులను అలరించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కళాకారులు దప్పు రామస్వామి, జోగు వెంకట్, టీపీసీసీ సాంస్కృతిక సేన మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు రాహుల్, కార్యదర్శి అమృతన్న, ఉపాధ్యక్షుడు బాలరాజ్, ప్రజానాట్య మండలి రాష్ట్ర కమిటీ సభ్యుడు ప్రవీణ్, జర్నలిస్ట్ సాయిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## మిన్నుముట్టిన అమ్మవారి నామస్మరణ

**చిక్కడపల్లి, ఆగస్టు 2 ప్రభాతవార్త :** రాంనగర్‌లోని వీఎస్టీలో ఆషాఢ మాస బోనాల మహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. వీఎస్టీ వర్కర్స్ యూనియన్ సలహాదారులు ఆర్.డి.చంద్రశేఖర్, కె.రాజు, ప్రధాన కార్యదర్శి ఎల్.డి.పాల్, చీఫ్ వైస్ ప్రెసిడెంట్ జి.నాగేష్, డిప్యూటీ జనరల్ సెక్రటరీ శ్రీనివాస్‌యాదవ్, కోశాధికారి పి.కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో లక్ష్మీగణపతి, మహిమాన్విత అమ్మవార్ల మూల విగ్రహాలకు ముస్తాబుచేసి, పూజలు, అభిషేకాలు నిర్వహించారు. శోభాయాత్రగా తరలివచ్చిన బోనాలు, పోతురాజుల విన్యాసాలతో ప్రాంగణమంతా అమ్మవారి దివ్య నామస్మరణతో ప్రతిధ్వనించింది. యూనియన్ నాయకులు ప్రభాకర్, నవీన్‌బాబు, సమద్, రణవీర్‌రెడ్డి, మల్లేశం, కంపెనీ హెచ్ఆర్ వైస్ ప్రెసిడెంట్లు శ్రీరామ్, కె.వి.రామకృష్ణ, డీజీఎం శివకుమార్ మరియు భక్తులు, కార్మికులు పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.



ఆషాధ మాస బోనాలను తీసుకెళతున్న మహిళలు

## తల్లిపాలతోనే శిశువుకు ఆరోగ్యం

**హైదరాబాద్, ఆగస్టు 2, ప్రభాతవార్త :** తల్లిపాల విశిష్టతను ప్రజల్లో అవగాహన పెంచడానికి వాక్‌థాన్ చేపట్టారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవం సందర్భంగా ఆదివారం కొండాపూర్‌లో నిర్వహించిన తల్లిపాల అవగాహన వాక్‌థాన్‌లో ప్రసూతివైద్యులు, నియోనటాలజిస్టులు, చిన్నపిల్లల వైద్యులు, నర్సులు, లాక్టేషన్ కన్సల్టెంట్లు, గర్భిణులు, చిన్నారుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. తల్లిపాలు ఇవ్వడం తల్లి ఒక్కరి బాధ్యత మాత్రమే కాదని, కుటుంబం, సమాజం అందుకు సహకరించాలని ఈ సందర్భంగా సందేశం ఇచ్చారు. వారం రోజుల పాటు గర్భిణులు, బాలింతలు, కుటుంబ సభ్యులకు తల్లిపాలపై శాస్త్రీయ అవగాహన కల్పించే పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పుట్టిన తర్వాత తొలి ఆరు నెలలు శిశువుకు పూర్తిగా తల్లిపాలు ఇవ్వాలని, అనంతరం అనుబంధ ఆహారంతో పాటు రెండేళ్లు లేదా అంతకంటే ఎక్కువకాలం తల్లిపాలు కొనసాగించాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బి.భాస్కర్‌రావు, డా.సి.అపర్ణ,సి.అర్చనారెడ్డిలు మాట్లాడుతూ ఆరోగ్యానికి తల్లిపాలు తొలి పెట్టుబడి. ఇవి శిశువుకు సంపూర్ణ పోషకాహారాన్ని అందించడమే కాకుండా రోగనిరోధక శక్తిని పెంచి, మెదడు ఎదుగుదలకు దోహదపడతాయి. అలాగే తల్లి-బిడ్డల మధ్య బంధాన్ని మరింత బలోపేతం చేస్తాయన్నారు.





కొండాపూర్‌లో వాక్‌థాన్ నిర్వహిస్తున్న దృశ్యం

# మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు

-దౌల్తాబాద్ ఎస్ఐ వేణుకుమార్

**దౌల్తాబాద్,ఆగస్టు 2,ప్రభాతవార్త:** మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని దౌల్తాబాద్ ఎస్ఐ వేణుకుమార్ తెలిపారు. దౌల్తాబాద్-కోస్గి రోడ్డులో ఆదివారంరోజు ఎస్ఐ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ. .మండలంలోని వివిధ గ్రామాలలో వాహనాలు నడిపేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి,ట్రిపుల్ రైడింగ్‌కు దూరంగా ఉంటూ, బండి కాగితాలు సరిగ్గా ఉంచుకోవాలని సూచించారు. రోడ్డుపై ప్రయాణించేటప్పుడు ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలని, నిబంధనలకు విరుద్ధంగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రాణాలను కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


బ్రీత్ అనలైజర్ ద్వారా వాహనదారున్ని చెక్ చేస్తున్న పోలీసులు

# విద్యార్థులు ఏఐతో కాదు నిన్నటి మీతోనే పోటీ పడండి

**మేడ్చల్, ఆగస్టు 2, ప్రభాతవార్త :** నేటి ప్రపంచం కృత్రిమ మేధస్సు (ఏఐ) యుగంలో ఉన్నప్పటికీ యువత ఏఐతో పోటీ పడాల్సిన అవసరం లేదని, ప్రతి ఒక్కరూ తమ నిన్నటి సామర్థ్యాన్ని అధిగమించే దిశగా ముందుకు సాగాలని మాజీ సీబీఐ జాయింట్ డైరెక్టర్, మహారాష్ట్ర మాజీ అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ వి.వి. లక్ష్మీ నారాయణ అన్నారు.

మేడ్చల్ మండలంలోని గౌడవెల్లి శివారులో గల హైదరాబాద్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ (హితం) 2026 బ్యాచ్ స్నాతకోత్సవాన్ని కళాశాల సమీపంలోని తారా కన్వెన్షన్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. సంస్థ 25 ఏళ్ల ఇంజినీరింగ్ విద్యా ప్రస్థానాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ, విద్యార్థులు భవిష్యత్తులో విజయాన్ని అందుకోవాలంటే కేవలం ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ మాత్రమే కాకుండా హ్యూమన్ ఇంటెలిజెన్స్, ఎమోషనల్ ఇంటెలిజెన్స్, ఎథికల్ ఇంటెలిజెన్స్ కూడా సమానంగా అవసరమని ఆయన పేర్కొన్నారు. ఆరోగ్యకరమైన శరీరమే విజయవంతమైన జీవితానికి పునాది అని చెప్పారు. కార్యక్రమంలో హిటామ్ గవర్నింగ్ బాడీ చైర్మన్ ప్రొఫెసర్ సంజయ్ ధాండే, డైరెక్టర్ జి.కె. విశ్వనాథ్, ప్రిన్సిపాల్ అరవింద్, గవర్నింగ్ బాడీ సభ్యులు బ్రిగేడియర్ గణేశం, నిర్మల సాంబమూర్తి, కృపాలి, అధ్యాపకులు, తల్లి దండ్రులు, పట్టభద్రులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ సీబీఐ జాయింట్ డైరెక్టర్ వి.వి. లక్ష్మీనారాయణ


చెట్లు పంపిణీ చేస్తున్న సర్పంచ్

## ఘనంగా వనమహోత్సవం

**తలకొండపల్లి, ఆగస్టు2, ప్రభాతవార్త:** తలకొండపల్లి మండల పరిధిలోని చీపునుంతల గ్రామంలో వన మహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ గుజ్జుల లక్ష్మమ్మ ఆసన్న ఆధ్వర్యంలో గ్రామంలోని ప్రజలందరికీ వనమహోత్సవం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గుజ్జుల లక్ష్మమ్మ ఆశన్న, కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు గుజ్జుల మహేష్, గ్రామ పంచాయతీ సభ్యులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

### వృద్ధురాలు మృతి ఆర్థిక సాయం అందించిన నాయకులు

**తలకొండపల్లి, ఆగస్టు2, ప్రభాతవార్త:** తలకొండపల్లి మండల పరిధిలోని చుక్కాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని ఎడవెల్లి గ్రామానికి చెందిన గుద్దేటి లక్ష్మమ్మ(62) అనారోగ్యానికి గురై మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు వృద్ధురాలు కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కాసు శ్రీనివాస్ రెడ్డి అందించిన రూ.4వేలు ఆర్థిక సాయాన్ని మృతురాలి కుమారుడు వెంకటయ్యకు అందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ నాయకులు గుద్దేటి బాలయ్య యువజన కాంగ్రెస్ నాయకులు రాజకుమార్ గోపురం రఘు శీను లాలయ్య కనకయ్య మల్లయ్య మహేష్ ఆంజనేయులు చంద్రయ్య బాలస్వామి రవితేజ తదితరులున్నారు.

గట్టు ఇప్పలపల్లి లోతలకొండపల్లి మండల పరిధిలోని గట్టు ఇప్పల పల్లి గ్రామానికి చెందిన బోయ బాలమ్మ(60), మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న వార్డు సభ్యులు శెట్టి రాజశేఖర్ వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం వ్యక్తిగతంగా రూ.2వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు శెట్టి రాజశేఖర్ వెంకటేష్ పవన్ వాల్మీకి తదితరులున్నారు.

## ఇంటి నిర్మాణానికి సిమెంట్ పంపిణీ



ఇంటి నిర్మాణానికి సిమెంట్ అందజేస్తున్న నాయకులు

**తలకొండపల్లి, ఆగస్టు2, ప్రభాతవార్త:** తలకొండపల్లి మండల కేంద్రానికి చెందిన బోల లక్ష్మమ్మ ఇంటి నిర్మాణంకోసం ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ నుంచి ఉచితంగా సిమెంటును పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ కటికల శేఖర్ యాదవ్ ఆధ్వర్యంలో లక్ష్మమ్మ ఇంటికి అవసరమాగు సిమెంటును ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ శేఖర్ యాదవ్ మాట్లాడుతూ ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ నుంచి ఆర్థిక స్తోమత లేని వారికి ఇంటి నిర్మాణానికి కోసం ఆర్థిక సాయం అందజేస్తున్నామని, ఇంటికి అవసరమగు మెటీరి యల్ను ఉచితంగా అందజేస్తు న్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కటికల శేఖర్ యాదవ్, మాజీ సర్పంచ్ పెరుమాల లలిత జ్యోతయ్య, ఉప సర్పంచ్ లోకం కోటేశ్వర్ వార్డు సభ్యులు కుమార్ అలివేలు ఆంజనేయులు శ్రీకాంత్ పాండు లింగం నరసింహ శ్రీరామ్ శీను తదితరులు ఉన్నారు.

### కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడుకి మాతృవియోగం

**తలకొండపల్లి, ఆగస్టు2, ప్రభాతవార్త:** తలకొండపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాసు శ్రీనివాస్ రెడ్డి మాతృమూర్తి కాసు సీతమ్మ ఆదివారం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు సింగల్ విండో చైర్మన్ గట్ల కేశవరెడ్డి, ఆమనగల్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యాట నరసింహ లు కాసు శ్రీనివాస్ రెడ్డి తల్లి మృతి చెందడం పట్ల పరామర్శించారు. ఈ కార్యక్రమంలో సింగల్ విండో చైర్మన్ కేశవరెడ్డి, అమంగల్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యాట నరసింహ, మాజీ జెడ్పిసి పద్మ నరసింహ, తాలూకా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు లట్టపల్లి రమాదేవి, మోహన్ రెడ్డి అంజయ్య రమేష్ యాదవ్ బాల్రెడ్డి తదితరులున్నారు.

## జైల్ బరోని విజయవంతం చేయండి

**తలకొండపల్లి, ఆగస్టు2, ప్రభాతవార్త:** కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 10న నిర్వహించే జైల్ బరో జైల్ బరో కార్యక్రమాన్ని విజయ వంతం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు అంజయ్య, కార్యదర్శి జగన్లు పిలుపునిచ్చారు. దేవకీ గార్డెన్లో సిఐటియు నాయకులు గుమ్మడి కురుమయ్య అధ్యక్షతన వ్యవసాయ కార్మిక సంఘం రైతు సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన వారు మాట్లాడరు కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా వ్యవహరిస్తూ ఉపాధి కార్మిక రైతు కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా వ్యవహరిస్తూ కార్మిక చట్టాలకు వ్యతిరేకంగా విధానాలను అమలు చేస్తుందని కార్మిక చట్టాలకు వ్యతిరేకంగా విధానాలను అమలు చేస్తుందని వారు అన్నారు. లేబర్ కోట్ల రద్దు విద్యుత్ సౌరణ లేబర్ కోట్ల రద్దు విద్యుత్ సవరణ బిల్లు చేయడం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాదయం చట్టాన్ని పేరు మారుస్తూ ఆ చట్టానికి తోట్లు పడడం జరుగుతుందని వారు విమర్శించారు. సిఐటియు ఆధ్వర్యంలో అన్ని కార్మిక సిఐటియు ఆధ్వర్యంలో అన్ని కార్మిక సంఘాలతో సంఘాలతో ఈ నెల 10న నిర్వహించే జైలు బరో కార్యక్రమాన్ని అందరూ పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**కీసర, ఆగస్టు2, ప్రభాతవార్త:** రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సంఘటన ఆదివారం కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సిఐ ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం కీసర సర్కిల్ పరిధిలోని చీర్యాల గ్రామానికి చెందిన మంద నర్సింహులు (35) వృత్తి రిత్యా సూపర్‌వైజర్. రోజులాగే తన విధులకు హాజరుకావడానికి తన బైక్‌పై అహ్మద్‌గూడ నుండి నాగారం వెలుతుండగా రాంపల్లి చౌరస్తా వద్ద గల మహేంద్రా షోరూం సమీపానికి చేరుకోగానే అహ్మద్‌గూడ నుండి నాగారం వెలుతున్న లారీ డ్రైవర్ అతి వేగంగా, నిర్లక్ష్యంగా నడుపుతూ అకస్మాత్తుగా కుడి వైపు మళ్లించి మృతుడి బైక్‌ను బలంగా ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో మృతుడు రోడ్డుపై ఉన్న డివైడర్‌పై పడిపోయి తలకు తీవ్ర గాయాలు కావడంతో సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. ఈ కేసును కీసర పోలీసులు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## హైవే అభివృద్ధి పనులకు శ్రీకారం

మీడియా సమావేశంలో చేవెళ్ల ఎంపి కొండా విశ్వేశ్వర్ రెడ్డి

**మొయినాబాద్, ఆగస్టు 2, ప్రభాతవార్త :** హైదరాబాద్ బీజాపూర్ జాతీయ రహదారి (హైవే) అభివృద్ధి పనులకు కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని చేవెళ్ల పార్లమెంటు సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి అన్నారు. మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని బీజేపీ పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గత ప్రభుత్వాల నిరక్ష్యం వల్లనే బీజాపూర్ రోడ్డు విస్తరణ, భూసేకరణ పనులలో తీవ్రమైన జాప్యం జరిగిందని ఎంపీ విమర్శించారు. నిజాం కాలం నాటి రోడ్డు కావడంతో, పెరుగుతున్న రద్దీకి అనుగుణంగా ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకొని కేంద్ర ప్రభుత్వం ఈ రహదారి పనులను చేపడుతోందని ఆయన తెలిపారు. రోడ్ల నిర్మాణం ఆధునీకరించడం ద్వారా ప్రయాణాలు సులభం కావడంతో పాటు, భవిష్యత్తులో ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన రక్షణ చర్యలు తీసుకునేలా కేంద్రం పకడ్బందీ ప్రణాళికలు రూపొందిస్తోందని కొండా విశ్వేశ్వర్ రెడ్డి అన్నారు. కొందరు కాంగ్రెస్ ఎమ్మెల్యే మేమే తెచ్చాం బీజాపూర్ హైవే రోడ్డు అని సోషల్ మీడియాలలో డబ్బు కొట్టుకొని తిరుగుతున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కె ఎస్ రత్నం ,రాష్ట్రకార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.


వరంగల్ జాతీయ రహదారిపై నారపల్లి వద్ద రోడ్డు గుంతలను పూడ్చివేయించిన ఘట్‌కేసర్ ట్రాఫిక్ పోలీసులు.

## గుంతలను పూడ్చివేయించిన ఘట్‌కేసర్ ట్రాఫిక్ పోలీసులు

**ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 2, ప్రభాత వార్త:** పోచారం డివిజన్ వరంగల్ జాతీయ రహదారిపై నారాపల్లి వద్ద రోడ్డులో గుంతలు పడగా ట్రాఫిక్ పోలీసులు తారుతో గుంతలు పూడ్చటం పట్ల ప్రయాణికులు హర్షం వ్యక్తం చేశారు. నారపల్లి యూటర్న్ వద్ద భారీగా గుంతలు పడగా వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఘట్‌కేసర్ ట్రాఫిక్ సీఐ వై. రవీందర్, ఎస్సై సోమయ్య సిబ్బందితో కలిసి వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. రోడ్డు కాంట్రాక్టర్ నరేందర్‌ను తక్షణమే పిలిపించి గుంతలను డాంబర్‌తో పూడ్చివేయించారు. మరమ్మత్తు పనులు జరుగుతున్న సమయంలో ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలగకుండా పోలీసులు సమర్థవంతంగా ట్రాఫిక్‌ను నియంత్రించి వాహనాల రాకపోకలు సాఫీగా కొనసాగేలా చర్యలు చేపట్టారు. రోడ్డుపై గుంతలను పూడ్చివేయించినందుకు రోడ్డు ప్రయాణీకులు, స్థానికులు ట్రాఫిక్ పోలీసుల సేవలను హర్షం వ్యక్తం చేశారు. ప్రజల భద్రత సౌకర్యమే తమ ప్రాధాన్యమని ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

## రక్తదానం చేసి ప్రాణదాతలు కండి

**కడ్తాల్, ఆగస్టు 2, ప్రభాత వార్త:** రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని యువతి యువకులు రక్తదానం చేయటం వల్ల ఒకరి ప్రాణాలు కాపాడిన వారవుతారని తెలంగాణ రాష్ట్ర మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్, తలకొండపల్లి మాజీ జెడ్పిటిసి ఉప్పల వెంకటేష్ గుప్తా, డిసిసిబి డైరెక్టర్, ఆమనగల్లు సింగల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తాలు అన్నారు. ఆదివారం కడ్తాల్ పట్టణంలో ప్రపంచ స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఫ్రెండ్స్ ఫర్ లైఫ్ ఆధ్వర్యంలో తల సేమియా బాధిత చిన్నారుల కోసం మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ రక్తదాన శిబిరాన్ని ముఖ్య అతిథులుగా హాజరైన ఉప్పల వెంకటేష్ గుప్తా, గంప వెంకటేష్ గుప్తాలు ప్రారంభించారు. రక్తదాన శిబిరం లో స్వచ్ఛందంగా 60 మంది పాల్గొని రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్రీను నాయక్, రైతు సమన్వయ సమితి సభ్యులు మంగళపల్లి నరసింహ, రావిచెడు ఉపసర్పంచ్ యాదయ్య, రావిచెడు బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రమేష్, మాజీ ఎంపిటిసి లచ్చిరాం నాయక్, అమృతం పాండు, సురేష్, దాసు, ఏ సురేందర్, జి శ్రావణ్ కుమార్, విశ్రాంత్, రషీద్, శశికాంత్, గౌస్, రాకేష్, అబ్బ రమేష్, వెంకటేష్, శ్రీకాంత్, మహేష్, రాకేష్, ఒగ్గు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## మాయమాటలు చెప్పి బంగారు పుస్తెలతాడు అపహరణ

-- నిందితురాలిని అరెస్టు చేసిన పోలీసులు

**తాండూరు, ఆగస్టు 2, ప్రభాతవార్త :** మాయమాటలతో మహిళను నమ్మించి బంగారు పుస్తెలతాడును అపహరించిన నిందితురాలిని తాండూరు పట్టణ పోలీసులు అదుపులోకి తీసుకొని కటకటాల్లోకి నెట్టారు. ఆమె వద్ద నుండి సుమారు 3తులాల పుస్తెలతాడు స్వాదీనం చేసుకున్నట్లు పట్టణ సీఐ పరమేశ్వర్ గౌడ్ తెలిపారు. ధారూర్ ప్రాంతానికి చెందిన నీరటి స్వరూప తాండూరు పట్టణం మార్వాడిబజార్‌లోని వైద్యలింగం, విజయమ్మల ఇంట్లో అద్దెకు ఉండేది. కొన్ని రోజుల క్రితం ఇంటిని ఖాళీ చేసి వెళ్లి పోయింది. అయితే, గత నెల 21న స్వరూప మార్వాడి బజార్‌లో ఉన్న విజయమ్మను కలిసేందకు వెళ్లింది. విజయమ్మ మెడలో ఉన్న పుస్తెల తాడును చూసి పుస్తెలతాడు డిజైన్ చాలా బాగుంది.. మా తమ్ముడి పెళ్లికి ఇలాంటి డిజైన్ చేయించాలనుకుంటున్నాం అంటూ స్వరూప మాటలు కలిపింది. పుస్తెలతాడు ఫోటో తీసుకుంటానని నమ్మించింది చేతులోకి తీసుకొని అక్కడి నుండి పరారైంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టిన పోలీసులు నీరటి స్వరూపను అదుపులోకి తీసుకొని ఆమె వద్ద ఉన్న బంగారు పుస్తెలతాడును స్వాదీనం చేసుకున్నట్లు సీఐ వెల్లడించారు.

## చెట్టును ఢీకొన్న బైక్.. బీటెక్ విద్యార్థి మృతి

**షాబాద్, ఆగస్టు 2, ప్రభాతవార్త :** షాబాద్ మండలం పోతుగల్ గ్రామ సమీపంలో ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో బీటెక్ విద్యార్థి మృతి చెందగా, మరో యువకుడు గాయపడ్డాడు. పోలీసుల వివరాల ప్రకారం.. చేవెళ్ల మండలం న్యాలాట గ్రామానికి చెందిన, ప్రస్తుతం చేవెళ్లలో నివాసం ఉంటున్న పుప్పాల నాగేష్ కుమారుడు పుప్పాల చరణ్ (19) బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఆదివారం తన స్నేహితుడు, చేవెళ్లకు చెందిన ఎడ్ల సాత్విక్ (19)తో కలిసి (టీజీ 07 ఏకే 0140) నంబర్ గల మోటార్‌సైకిల్‌పై చేవెళ్ల వైపు వెళ్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. బైక్‌ను అతివేగంగా నడపడం వల్ల పోతుగల్ గ్రామ సమీపంలోని డివైడర్‌లో ఉన్న చెట్టును బైక్ ఢీకొట్టినట్లు పోలీసులు తెలిపారు. ప్రమాదంలో పుప్పాల చరణ్‌కు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. వెనుక కూర్చున్న ఎడ్ల సాత్విక్ గాయపడగా చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై షాబాద్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

### అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

**మేడ్చల్, ఆగస్టు 2. ప్రభాతవార్త :** ఆషాడ మాసం బోనాల పండుగ సందర్భంగా మేడ్చల్ పట్టణంలోని ఏడు గుళ్ల ఆలయంలో నిర్వహించిన బోనాల ఉత్సవాల్లో మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదే విదంగా బోనాల పండుగను పునస్కరించుకుని పట్టణంలో చేపట్టిన పలు ఫలహార బండ్ల ఊరేగింపు కార్యక్రమలలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు భాస్కర్ యాదవ్, నవీన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## గుండ్లపోచంపల్లి డివిజన్‌లో మహంకాళీ బోనాలు

**మేడ్చల్, ఆగస్టు 2, ప్రభాతవార్త :** గుండ్లపోచంపల్లి డివిజన్‌లో మహంకాళీ బోనాల పండుగను ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు, మాజీ జడ్పీటీసీ సాయిపేట శ్రీనివాస్ పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## పట్టపగలే ఇంట్లో చోరీకి పాల్పడిన దొంగలు

90 గ్రాముల బంగారం 20 వేల నగదు అపహరణ

**ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 2, ప్రభాత వార్త:** పోచారం ఐటీ కారిడార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పట్టపగలే దొంగలు ఇంట్లోకి ప్రవేశించి 90 గ్రాముల బంగారం, 20 వేల రూపాయల నగదు చోరీ అయిన సంఘటన చోటుచేసుకుంది. పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఆదివారం మధ్యాహ్నం చోరీ సంఘటన జరిగింది. సంఘటన వివరాలు స్థానిక పోలీసుల కథనం ప్రకారం ఇలా ఉన్నాయి. యంనంపేట్ గ్రామానికి చెందిన పోలగోని మధు ( 67 ), భార్య వినోద ( 55 ), అంబేద్కర్ విగ్రహం సమీపంలో నివాసం ఉంటున్నారు. మధ్యాహ్నం సమయంలో వినోద ఇంటి తలుపు, గేటుకు తాళం వేసి పక్కింటికి వెళ్లింది. కొద్దిసేపటికి తర్వాత తిరిగి వినోద ఇంటికి వచ్చేసరికి తాళాలు పగలగొట్టినట్లుగా కనిపించగా అవాక్కయ్యింది. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా తాళం తెరిచి ఉంది. బీరువాలోని 90 గ్రాముల బంగారం, 20 వేల నగదును దొంగలు ఎత్తుకెళ్లినట్లు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోచారం ఐటీ కారిడార్ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు తెలిపారు.

## బోనాల నిర్వహణకు ఏకగ్రీవ తీర్మానం

**ఘట్‌కేసర్, జులై 2, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ డివిజన్ పరిధిలోని శివారెడ్డిగూడ, మారుతీనగర్, శ్రీనిధి నెస్ట్ కాలనీలలో ఈ నెల 9న బోనాల మహోత్సవాలను ఘనంగా నిర్వహించాలని కాలనీల పెద్దలు ఏకగ్రీవంగా నిర్ణయించారు. ఈ మేరకు ఆదివారం నిర్వహించిన సమావేశంలో బోనాల ఉత్సవాల నిర్వహణ, ఏర్పాట్లపై చర్చించి తీర్మానం చేశారు. మూడు కాలనీల ప్రజలంతా భక్తిశ్రద్ధలతో అమ్మవారికి బోనాలు సమర్పించి ఉత్సవాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పండుగను సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తూ భక్తి, ఆధ్యాత్మిక వాతావరణంలో జరుపుకోవాలని నిర్ణయించారు. ఉత్సవాల నిర్వహణకు ప్రతి కుటుంబం సహకరించి, సామూహికంగా పాల్గొని బోనాల వేడుకలను విజయవంతం చేయాలని కాలనీల పెద్దలు కోరారు. ఈసమావేశంలో కంది ప్రవీణ్ కుమార్, మడిపడిగె ఆంజనేయులు, మడిపడిగె రాజ్‌కుమార్, లంబ శ్రీనివాస్ యాదవ్, మెడబోయిన సంజీవ ముదిరాజ్, వై.నితిన్ రెడ్డి, జి.సంజీవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



శివారెడ్డిగూడ మారుతీనగర్‌లోని పోచమ్మ అమ్మవారు.

## జాతరకు ఎమ్మెల్యే మల్లారెడ్డికి ఆహ్వానం

**ఘట్‌కేసర్, ఆగష్టు 2, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్‌లోని గోదా సమేతశ్రీమన్నార్ రంగనాయకస్వామి దేవాలయంలో ఈనెల 13 నుంచి 19 వరకు జరిగే బ్రహ్మోత్సవాలకు విచ్చేయాలని ఆలయ ధర్మకర్త పవనచార్యులు మేడ్చల్ శాసన సభ్యులు చామకూర మల్లారెడ్డిని ఆహ్వానించారు. ఈమేరకు బోయిన్‌పల్లిలోని ఎమ్మెల్యే నివాసానికి వెళ్లి ఎమ్మెల్యే దంపతులను శాలువాలతో సత్కరించిన పవనాచార్యులు వారికి ఆలయ ఉత్సవాల ఆహ్వాన పత్రికను అందజేశారు. ఆలయంలో బ్రహ్మోత్సవాలలో భాగంగా ఈనెల 16న కళ్యాణం, 17న రథోత్సవం నిర్వహిస్తారని తప్పకుండా రావాలని కోరారు. ఈకార్యక్రమంలో మాజీ ఎంపిటిసి మంకం రవి, సహకార సంఘం మాజీ డైరక్టర్ చందుపట్ల ధర్మారెడ్డి, ఆర్‌బిఎస్ జిల్లా మాజీ సభ్యులు చిలుగూరి మంకయ్య, నాయకులు కుక్కునూరి రాజశేఖర్, కానుగంటి శ్రీనివాస్, చెన్నారెడ్డి, మల్లేశులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే మల్లారెడ్డి దంపతులకు ఆహ్వానపత్రిక అందజేస్తున్న ధర్మకర్త పవనాచార్యులు

### అంబరాన్నంటిన మల్లన్న బోనాల సంబరాలు

**నందిగామ, ఆగస్టు 2, ప్రభాతవార్త :** నందిగామ మండలం వెంకమ్మగూడ గ్రామంలో ఆదివారం మల్లన్న దేవుని బోనాలు అత్యంత భక్తిశ్రద్ధలతో సాగాయి. వెంకమ్మగూడ సర్పంచ్ గొర్లపల్లి అశోక్ ఆధ్వర్యంలో జరిగిన ఈ బోనాల వేడుకలతో గ్రామంలో ఆధ్యాత్మికత వాతావరణం నెలకొంది . భక్తి గీతాలతో మహిళలు మల్లన్న దేవునికి బోనంతో నైవేద్యం సమర్పించి మొక్కుబడులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ అశోక్ మాట్లాడుతూ ఎలీనివో ఎఫెక్ట్ ప్రభావం పడకుండా ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురవాలని, రైతులు, ప్రజలందరూ సుఖ సంతోషాలతో జీవించేలా దీవించమని భగవంతున్ని వేడుకున్నారు. ఈ వేడుకల్లో గ్రామస్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొన్నారు.


వెంకమ్మగూడలో మల్లన్న బోనాల వేడుకలో పాల్గొన్న సర్పంచ్, నాయకులు


సిడితండాలో బోనాల వేడుకలో పాల్గొన్న సర్పంచ్, నాయకులు

## సిడితండాలో...వైభవంగా బోనాలు

**నందిగామ, ఆగస్టు 2, ప్రభాతవార్త :** నందిగామ మండలం సిడి త్నాడ గ్రామంలో ఆదివారం దుర్గామాతకు (మెరమ్మా యాడి) బోనాల వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధలతో కొనసాగించారు. సిడితండ సర్పంచ్ గబ్రుచౌహాన్ ఆధ్వర్యంలో మహిళల ఆటపాటలతో, డిజె సౌండ్ సిస్టం మధ్య, పోతురాజుల విన్యాసాల మధ్య, టపాకాయలు కాలుస్తూ ఘనంగా జరిగాయి. ఈ బోనాల వేడుకలతో తండాలో ఆధ్యాత్మికత వాతావరణం నెలకొంది . చిన్న, పెద్ద ,ముసలి ముతక ,వయోభేదం లేకుండా మహిళలు అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కుబడులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ రవీందర్ నాయక్ , వార్డు సభ్యులు బుజ్జి శంకర్ నాయక్,శాంతి శ్రీను, పాత్లావత్ శ్రీనునాయక్, మేఘవత్ నాగేష్, పత్తి శ్రీను, నాయకులు మూడావత్ తులసి రామ్, కిషన్ నాయక్, చందర్ నాయక్, లింబ్యా నాయక్, రూపా సింగ్ ,శంకర్ నాయక్, హేమంత్ నాయక్,రాములు నాయక్,గోవింద్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

### కుమ్మరిగూడెంలో బోనాలు

**షాబాద్, ఆగస్టు 2, ప్రభాతవార్త :** మండల పరిధిలోని కుమ్మరిగూడెం గ్రామంలో మహంకాళి బోనాల ఉత్సవాలను ఆదివారం కనుల పండుగ నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు సాంప్రదాయ దుస్తులు ధరించి బోనాలను అలంకరించుకొని ఆలయం వరకు ర్యాలీగా బయలుదేరారు అనంతరం నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.


వ్యాసరచన పోటీలో పాల్గొన్న విద్యార్థులు

## వ్యాస రచన పోటీలు

**మేడ్చల్, ఆగస్టు 2, ప్రభాతవార్త :** మేడ్చల్ పట్టణంలోఒని గడీ మైసమ్మతల్లి శ్రావణమాస బోనాల ఉత్సవం సందర్భముగా విద్యార్థులకు స్వదేశీ వస్తువులు విని యోగం ద్వారా ఆత్మ నిర్భర్, వికసిత భారత్ అనే అంశాన్ని వ్యాసరచన పోటీలు దేవాలయం కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ప్రతి సంవత్సరం విధంగా నిర్వహించిన ఈ వ్యాసరచన పోటీలో సుమారుగా 200 విద్యార్థులు వివిధ పాఠశాల నుండి పాల్గొన్నారు. ఈ నెల 23న నిర్వహించే అమ్మవారి బోనాల పండుగ రోజున ఉత్తమ విద్యార్థులకు బహుమతులు, ప్రతి ఒక్కరికి సర్టిఫికెట్స్ అందజేస్తామని కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లింగం, కిషోర్, లక్ష్మణ్, హేమలత, విజయ, శివ శంకర్ తదితరులు పాల్గొన్నారు.


కాలుష్యనీటితో నిండిన అన్నోజిగూడ మిరాలం కుంట చెరువు దృశ్యం

## కాలుష్యమయంగా మారిన మిరాలం కుంట చెరువు

**ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 2, ప్రభాత వార్త:** పోచారం డివిజన్ అన్నోజిగూడలోని మిరాలం కుంట చెరువులోకి పలు అపార్టుమెంటుల నుండి వెలువడే మురుగునీటి డ్రైనేజీ వ్యవస్థను నేరుగా కలుపడంతో కాలుష్యకారకంగా మారుతోంది. పలు వ్యర్థ రసాయనాలు చెరువులోకి నేరుగా కలువడం ద్వారా మిరాలం కుంట చెరువు మురుగుకూపంగా మారింది. డివిజన్ పరిధిలోని థ ఆనంద్ హోమ్స్, సంస్కృతి టౌన్‌షిప్ నుండి డ్రైనేజీ నీరు నేరుగా చెరువులోకి వదలడం ద్వారా సహజ చెరువుగా ఉన్న చెరువు కాలుష్యకరకంగా మారింది. ఈ విషయమై స్థానికులు పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసిన స్పందించడం లేదని స్థానిక నాయకులు బాలగోని సుమన్ గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. మిరాలం కుంట చెరువును ఓ వైపు యథేచ్ఛగా మట్టితో పూడ్చివేస్తుంటే మరో వైపు థ ఆనంద్ హోమ్స్ అపార్టుమెంటు వారి నుండి వెలువడే మురుగునీటి డ్రైనేజీ వ్యవస్థను నేరుగా చెరువులోకి వదుతున్నారని స్థానిక నాయకులు బాలగోని సుమన్ గౌడ్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. సంబధిత ఇరిగేషన్, మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పోరేషన్, హైడ్రా అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని అన్నారు. సహజనీటితో ఉన్న చెరువును కళ్లముందే నాశనమవుతుంటే అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహారించడం దారుణమని అన్నారు. ప్రభుత్వ ఆస్తులు, చెరువులను నాశనం చేస్తుంటే అధికారులు మాత్రం చెవిటివాని ముందు శంఖం ఊదినట్లు ఎన్నిసార్లు వినతులు ఇచ్చినా పట్టించుకోకపోవడం వెనుక లోపాయికారి ఒప్పందాలు ఉన్నాయా అని సందేహం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి కుంటలో పోసిన మట్టిని తొలగించి, డ్రైనేజీ నీరు నేరుగా కలువకుండా గట్టి చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. అధికారులు స్పందించకపోతే ప్రజలతో కలిసి ఆందోళనలు చేపడుతామని స్థానికులు హెచ్చరిస్తున్నారు.

### సిఎస్కే కాలనీలో రెండు మృత శునకాలతో దుర్వాసన


మృతి చెందిన శునకాలు

**షాద్‌నగర్, ఆగస్టు 2, ప్రభాతవార్త :** షాద్‌నగర్ పట్టణంలోని సీఎస్కే కాలనీలో విల్లా నంబర్లు 240, 673 సమీపంలో రెండు శునకాలు మృతి చెంది రెండు నుంచి మూడు రోజులు గడిచినా వాటిని తొలగించకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శునకాల కళేబరాలు కుళ్లిపోవడంతో భరించలేని దుర్వాసన వెదజల్లుతుండటంతో కాలనీవాసులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానికుల కథనం ప్రకారం, ఈ విషయాన్ని పలుమార్లు సంబంధిత మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదని ఆరోపిస్తున్నారు. దుర్వాసన కారణంగా చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణులు ఎక్కువగా ఇబ్బందులు పడుతున్నారని, ఇళ్ల తలుపులు, కిటికీలు కూడా తెరవలేని పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. వర్షాకాలం కావడంతో కుళ్లిపోయిన కళేబరాల వల్ల ఈగలు, దోమలు పెరిగి డెంగీ, చికున్‌గున్యా, వైరల్ జ్వరాలు వంటి అంటువ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు .ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని మృత శునకాల కళేబరాలను వెంటనే తొలగించి, ఆ ప్రాంతంలో బ్లీచింగ్ పౌడర్ చల్లి క్రిమిసంహారక మందులు పిచికారీ చేసి పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని కాలనీవాసులు మున్సిపల్ అధికారులను కోరుతున్నారు. సమస్యను అత్యవసరంగా పరిష్కరించి ప్రజలను దుర్వాసనతో పాటు అనారోగ్య ముప్పు నుంచి కాపాడాలని వారు విజ్ఞప్తి చేశారు.

### రావిర్యాలలో ఘనంగా మైసమ్మ బోనాలు

**జిల్లేడు చౌదరి గూడ, ఆగస్టు 2,ప్రభాత వార్త :** జిల్లేడు చౌదరి గూడ మండలంలోని రావిర్యాల గ్రామంలో ఆదివారం మైసమ్మ బోనాల పండుగ ను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా గ్రామం లో ఊరేగింపు నిర్వహించారు. గ్రామంలో పోరురాజుల విన్యాసాలు ప్రజలను ఎంతగానో ఆకట్టుకున్నాయి. అనంతరం అమ్మవారి దేవాలయం చుట్టు ప్రదక్షణాలు చేశారు. భక్తులు అమ్మ వారి కోసం తీసుకువచ్చిన నైవేధ్యలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళ లు, యువకులు, తదితరులు పాల్గొన్నారు.

### అత్వెల్లిలో పోచమ్మ, దుర్గమ్మ బోనాలు

మేడ్చల్, ఆగస్టు 2. ప్రభాతవార్త ః మేడ్చల్ పట్టణంలోని ఏడు గుళ్ల ఆలయం, మేడ్చల్ డివిజన్ పరిధి అత్వెల్లి గ్రామంలోని పోచమ్మ, దుర్గమ్మ ఆలయాల్లో బోనాలు పండుగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు ఉదయం నుంచే ఆలయాలకు తలివెళ్లి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపి మొక్కులు తీర్చుకున్నారు.